మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..


శనివారం SATURDAY 17-1-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 || సంచిక: 198 Issue: 198

Published from Jagitial www.evarthalu.com

17 జనవరి 2026 - శనివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - హేమంత ఋతువు పుష్య మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:53 సూర్యాస్తమయం - సా. 5:59 తిథి చతుర్దశి రా. 12:02o వరకు తరువాత అమావాస్య సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం మూల ఉ. 8:05 వరకు తరువాత పూర్వాషాఢ యోగం వృఘతా రా. 9:10 వరకు కరణం విష్టి ఉ. 11:14 వరకు శకుని రా. 12:02o వరకు వర్జ్యం ఉ. 6:25 నుండి ఉ. 8:11 వరకు దుర్ముహూర్తం ఉ. 8:22 నుండి ఉ. 9:06 వరకు రాహుకాలం ఉ. 9:39 నుండి ఉ. 11:03 వరకు యమగండం మ. 1:49 నుండి మ. 3:12 వరకు గుళికాకాలం ఉ. 6:53 నుండి ఉ. 8:16 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:17 నుండి ఉ. 6:05 వరకు అమృత ఘడియలు తె. 5:05 నుండి ఉ. 6:49 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:04 నుండి మ. 12:48 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

## ఏప్రిల్ నుంచి యూపీఐ ద్వారా పీఎఫ్ విత్‌డ్రా

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 8 కోట్ల మంది ఈపీఎఫ్‌వో (ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ) సభ్యులకు ఇది శుభవార్త. పీఎఫ్ ఖాతా నుంచి డబ్బులు ఉపసంహరించుకునే ప్రక్రియను మరింత సులభతరం చేస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది ఏప్రిల్ నాటికి యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) ద్వారా పీఎఫ్ డబ్బులను నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేసుకునే సౌకర్యం అందుబాటులోకి రానుందని కార్మిక తరువాయి 2 వ పేజీలో...




## ఫిబ్రవరి 1న స్టాక్ మార్కెట్లు ఓపెన్

### ఆదివారమైనా యథావిధిగా ట్రేడింగ్

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్ 2026-27 నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లు కీలక నిర్ణయం తీసుకున్నాయి. బడ్జెట్ ప్రవేశపెట్టే రోజైన ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం అయినప్పటికీ, ఆ రోజున యథావిధిగా ట్రేడింగ్ నిర్వహించనున్నట్లు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ), నేషనల్ స్టాక్ తరువాయి 2 వ పేజీలో...






## మేడారంలో కేబినెట్ భేటీ

### అధికారిక ఉత్తర్వులు విడుదల

హైదరాబాద్, జనవరి 16 (ఈవార్తలు): దక్షిణ భారత అతిపెద్ద కుంభమేళ జాతరగా పేరొందిన మేడారం వేదికగా మరో అరుదైన ఘట్టం ఆవిష్కృతం కాబోతోంది. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 18న భేటీ కాబోతుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అధికారికంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈనెల 18వ తేదీన మేడారంలోని హరిత హొటల్ లో సాయంత్రం 5 గంటలకు రాష్ట్ర కేబినెట్ భేటీ అవ్వనుంది. ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. మేడారం జాతర వేళా కేబినెట్ భేటీ విశేషంగా మారింది. సాధారణంగా రాష్ట్ర సచివాలయంలో కేబినెట్ భేటీ అవుతుంటోంది. ఈసారి -2 వ పేజీలో...

# నెత్తికి ఎక్కట్లేదా?


'జంపింగ్'లపై నిర్ణయంలో లేటెందుకు?

రెండు వారాల్లో డెసిషన్ తీసుకోవాలి

లేకపోతే మేమే నిర్ణయం తీసుకుంటాం

అనర్హత వేటు చర్యల అఫిడవిట్ ఇవ్వాలి

స్పీకర్‌కు తేల్చి చెప్పిన సుప్రీం కోర్టు



ఫోన్ ట్యాపింగ్ కేసులో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ప్రభాకర్‌రావు విచారణపై దర్యాప్తు సంస్థను ధర్మాసనం ప్రశ్నించింది. ఇప్పటికే రెండు వారాల కస్టడీకి అనుమతి ఇచ్చామని గుర్తు చేస్తూ.. ఇంకెంత కాలం ఇంటరాగేషన్ కొనసాగిస్తారు? ఈ కేసులో ఇంకా ఏం మిగిలుంది? అంటూ స్పష్టమైన ప్రశ్నలు సంధించింది.



తెలంగాణలో పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుపై శుక్రవారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ క్రమంలో తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఉద్దేశించి అత్యున్నత న్యాయస్థానం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారాన్ని తేల్చేందుకు తగిన సమయం ఇచ్చినా ఇంకా నిర్ణయం తీసుకోకపోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

న్యూఢిల్లీ/హైదరాబాద్, జనవరి 16 (ఈవార్తలు): పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల పిటిషన్లపై స్పీకర్ నిర్ణయం తీసుకుంటారా.. లేదంటే తామే నిర్ణయం తీసుకోవాలా అని కోర్టు ప్రశ్నించింది. ఈ విషయంలో స్పీకర్‌కు మరో అవకాశం ఇచ్చిన సుప్రీంకోర్టు.. రెండు వారాల్లోగా నిర్ణయం తీసుకోకపోతే.. తామే నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. రెండు వారాల్లో ఎమ్మెల్యేల అనర్హత వేటుపై స్పీకర్ తీసుకున్న చర్యల అఫిడవిట్ ఇవ్వాలని ఆదేశించింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ ధర్మాసనం శుక్రవారం ఈ కేసుపై విచారణ చేపట్టింది. ఈ క్రమంలో స్పీకర్ తరఫు న్యాయవాది.. ఇప్పటివరకు స్పీకర్ ఏడుగురు ఎమ్మెల్యేలకు సంబంధించిన పిటిషన్లపై తీసుకున్న చర్యలను కోర్టుకు విన్నవించారు. మిగతా వారిపై నిర్ణయం తీసుకోకపోవడంతో ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. దీంతో మిగతా తరువాయి 2 వ పేజీలో...

## ట్యాపింగ్ తాత్సారం ఇంకెన్నాళ్లు?

### సుప్రీంకోర్టు తీవ్ర అసహనం

న్యూఢిల్లీ: ప్రభాకర్‌రావు ఇంటరాగేషన్‌ను పూర్తిచేయాలని ఆదేశించిన కోర్టు.. మీ ఉద్దేశం పూర్తయిందా? లేదా? మళ్లీ ఆయన్ని జైలుకు పంపాలనుకుంటున్నారా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ముందస్తు బెయిల్ ఇచ్చినంత మాత్రాన ఆయనను విచారణకు పిలవకూడదని కాదని స్పష్టం చేసింది. అవసరమైతే మళ్లీ తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,340 |
| వెండి (గ్రాము): | రూ.306 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,786 |



## మోదీని మళ్లీ మళ్లీ కలుస్తా

### రాష్ట్ర అభివృద్ధి కోసం కలిసి తీరుతా.. స్పష్టం చేసిన సీఎం రేవంత్ రెడ్డి

ఎన్నికల సమయంలో రాజకీయాలు సహజమేనని, కానీ ఎన్నికల తర్వాత అభివృద్ధి కోసం అందరం కలిసి ముందుకు సాగాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందుకే ప్రతి మూడు నెలలకు ఒకసారి కేంద్ర ప్రభుత్వాన్ని కలుస్తామని, సాధ్యమైనంత వరకు అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నదే తన లక్ష్యమని చెప్పారు.

### బాసరలో వర్సిటీ ఏర్పాటు చేస్తామని వెల్లడి

నిర్మల్, జనవరి 16 (ఈవార్తలు): మోదీ తనకు వ్యక్తిగత బంధువుకాదని, దేశ ప్రధాని కాబట్టే ప్రాంత అభివృద్ధి కోసం ఆయనను కలుస్తున్నానని తెలిపారు. ప్రాంత ప్రయోజనాల కోసం ఎవరినైనా కలుస్తానని, తనకు వ్యక్తిగత పైరవీలు లేదా స్వార్థ ప్రయోజనాలు లేవని స్పష్టం చేశారు. నిర్మల్ లో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు తరువాయి 2 వ పేజీలో...

## భూభారతి స్కాం..


### 15 మంది అరెస్టు




రాష్ట్రంలో సంచలం సృష్టించిన ధరణి, భూభారతీ రిజిస్ట్రేషన్ల అక్రమాలకు పాల్పడిన ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టి రూ.3.90కోట్ల కుంభకోణంలో నిందితులుగా ఉన్న 15 మందిని జనగామ పోలీసులు అరెస్టు చేశారు. మరో తొమ్మిది మంది పరారీలో ఉన్నారు తెలిపారు.

వరంగల్/జనగామ, జనవరి 16 (ఈవార్తలు): ఈ ముఠా సభ్యుల నుంచి రూ.63.19 లక్షల నగదు, బ్యాంక్‌లో రూ.1లక్ష, సుమారు ఒక కోటి రూపాయల విలువైన ఆస్తి పత్రాలు, ఒక కారు, రెండు ల్యాప్ టాప్స్, ఐదు డెస్క్ టాప్ కంప్యూటర్లు, 17 సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ధరణి, భూ భారతీ కుంబకోణంతో సంబంధమున్న 15 మందిని పోలీసులు అరెస్టు చేసి వారి వివరాలు వెల్లడించారు. అరెస్టైన వారిలో 1.పసునూరి బసవ రాజు, వయసు: 32 సంవత్సరాలు (యాదాద్రి జిల్లా), 2. జెల్లా పాండ, వయసు: 46 సంవత్సరాలు (యాదాద్రి జిల్లా) 3. మహేశ్వరం గణేష్ కుమార్, వయసు: 39 సంవత్సరాలు (యాదాద్రి జిల్లా) 4. గాజులపాటి శ్రీనాథ్, వయసు: 35 సంవత్సరాలు (జనగామ), 5. యెనగంధుల వెంకటేష్, తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



తాజా అంతర్జాతీయ సర్వేల ప్రకారం పెళ్లికి, పిల్లలు కనడానికి అనువైన వయసు 25.9 ఏళ్లు అని తేలింది. 18 దేశాల్లో చేసిన సర్వే చేయగా, 25-27 ఏళ్ల మధ్య పెళ్లి చేసుకొనేవారు అన్ని రకాలుగా బెటర్ అన్న అభిప్రాయం ఏర్పడిందని ప్యూ రిసెర్చ్ సెంటర్ తెలిపింది. తొలి బిడ్డను కనే వయసు 26.1 ఏళ్లు అని, 30 ఏళ్లలోపు సొంత ఇంటిని కలిగి ఉండటం మంచిదని పేర్కొంది.

## 20న బీజేపీకి నూతన అధ్యక్షుడు

### 19న నామినేషన్ దాఖలు ప్రక్రియ.. రేసులో ముందున్న నితిన్ నబీన్



బీజేపీ తన తదుపరి జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకునే ఎన్నికల ప్రక్రియను అధికారికంగా ప్రకటించింది. రాజ్యసభ సభ్యుడు మరియు బీజేపీ జాతీయ ఎన్నికల ఇన్‌ఛార్జ్ డాక్టర్ కె. లక్ష్మణ్ ఒక అధికారిక ప్రకటనలో సంస్థాగత కసరత్తు కోసం షెడ్యూల్‌ను వెల్లడించారు.

న్యూఢిల్లీ: బీజేపీ జాతీయ అధ్యక్ష పదవి కోసం జనవరి 19న నామినేషన్లు దాఖలు కానున్నాయని, మరుసటి రోజు 20వ తేదీన కొత్త అధ్యక్షుడి పేరును ప్రకటిస్తామని తెలిపారు. జనవరి 19న మధ్యాహ్నం 2 గంటల నుండి 4 గంటల మధ్య నామినేషన్లను దాఖలు చేస్తారని వెల్లడించారు. అదే రోజు సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల మధ్య నామినేషన్ పత్రాల పరిశీలన, సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. అదేరోజు సాయంత్రం ఆరున్నర గంటలకు తరువాయి 2 వ పేజీలో...



## బీజేపీ 'పుర'నాదం

### మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో కమలం పార్టీ హవా.. 28 కార్పొరేషన్లలో విజయదుందుభి

### కొల్హాపూర్, లాతూర్‌లలో సత్తా చాటిన కాంగ్రెస్.. చాలాచోట్ల ఏకైక అతిపెద్ద పార్టీగా నిలిచిన బీజేపీ



## 242 వెబ్‌సైట్ లింకులు బ్లాక్

### బెట్టింగ్ వెబ్‌సైట్లపై కేంద్రం ఉక్కుపాదం

న్యూఢిల్లీ: అక్రమ ఆన్‌లైన్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ వెబ్‌సైట్లపై కేంద్ర ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరిస్తోంది. ఈ క్రమంలోనే జనవరి 16, శుక్రవారం ఒక్కరోజులోనే 242 అక్రమ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ వెబ్‌సైట్ లింకులను కేంద్ర ప్రభుత్వం బ్లాక్ -2 వ పేజీలో...

# రాశి ఫలాలు

17.1.2026

మేషం: ఆప్తులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. ఉద్యోగమున మీ ప్రతిభ వెలుగులోకి వస్తుంది. వ్యాపారస్థులకు నూతన అవకాశాలు లభిస్తాయి. సమాజంలో గౌరవ మర్యాదలకు లోటు ఉండదు. దీర్ఘకాలిక రుణాలు నుండి విముక్తి కలుగుతుంది. సంతాన విద్యా ఉద్యోగాలలో శుభవార్తలు అందుతాయి.

వృషభం: ఉద్యోగులకు లభించిన అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి. కుటుంబ సభ్యులతో ఉన్న వివాదాలు పరిష్కరించుకుంటారు. వృత్తి, వ్యాపారాలలో స్థిర నిర్ణయాలు అమలు చేస్తారు. వృత్తి ఉద్యోగాలలో అధికారుల నుండి ఆశించిన సహకారం అందుతుంది. ముఖ్యమైన పనుల్లో స్వంత ఆలోచనలతో ముందుకు సాగుతారు.

మిథునం: దైవ సేవా కార్యక్రమాలలో విశేషంగా పాల్గొంటారు. సంతానంతో అకారణ కలహాలు కలుగుతాయి. స్థిరాస్తి ఒప్పందాలు వాయిదా పడతాయి. వృత్తి ఉద్యోగాలలో సమస్యాత్మక వాతావరణం ఉంటుంది. ఋణ ఒత్తిడి వలన శిరోభాధలు తప్పవు. శ్రమాధిక్యతతో దూర ప్రయాణాలు చేయవలసి వస్తుంది.

కర్కాటకం: మిత్రులపై మీ అభిప్రాయాన్ని మార్చుకుంటారు. అనుకున్న సమయానికి పనులు పూర్తి చేయలేరు. చిన్నపాటి ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. కుటుంబ సభ్యులతో చిన్నపాటి వివాదాలు కలుగుతాయి. ఉద్యోగాల్లో అధికారుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుంది. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి.

సింహం: అందరితో సఖ్యతగా వ్యవహరించి ఆకట్టుకుంటారు. నూతన వాహన యోగం ఉన్నది. సమాజంలో కీర్తిప్రతిష్టలు పెరుగుతాయి. జీవిత భాగస్వామితో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. ధన పరంగా చేసే ప్రయత్నాలు అనుకూల ఫలితాలు ఇస్తాయి. బంధుమిత్రుల సమాగమం ఆనందం కలిగిస్తుంది.

కన్య: బంధు మిత్రుల సహాయ సహకారాలు అందిస్తారు. వ్యాపారాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. దీర్ఘ కాలిక అనారోగ్య సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. వృత్తి ఉద్యోగాలలో అధికారుల నుండి ప్రశంసలు అందుకుంటారు. ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి.

తుల: ఉద్యోగమున బాధ్యతలు సరిగా నిర్వహించలేరు. చేపట్టిన పనులు మందగిస్తాయి. కొందరి ప్రవర్తన మానసికంగా బాధిస్తాయి. కుటుంబ వ్యవహారాలలో ఆలోచనలలో స్థిరత్వం ఉండదు. విలువైన వస్తువులు విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి. వ్యాపారాలలో తీసుకున్న నిర్ణయాలు అంతగా కలిసిరావు.


వృశ్చికం: అవసరానికి చేతిలో డబ్బు నిల్వ ఉండదు. బంధు మిత్రులతో మాటపట్టింపులుంటాయి. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. నూతన వాహనం కొనుగోలు ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి. కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

ధనస్సు: అన్ని వైపుల నుండి అనుకూల వాతావరణం ఉంటుంది. ముఖ్యమైన పనులలో ధైర్యంగా నిర్ణయాలను తీసుకుని లాభాలు అందుకుంటారు. నూతన వస్త్ర ఆభరణాలు కొనుగోలు చేస్తారు. నూతన వ్యాపార ప్రారంభానికి అవరోధాలు తొలగుతాయి. సోదరుల నుండి ఊహించని ధన సహాయం అందుతాయి.

మకరం: ఉద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. ఆర్థికంగా ప్రతికూల వాతావరణం ఉంటుంది. ఇతరుల నుండి ఊహించని విమర్శలు కలుగుతాయి. వృత్తి బంధు మిత్రులతో మాటపట్టింపులుంటాయి. అనవసర వస్తువులపై ధనవ్యయం చేస్తారు. నేత్ర సంబంధిత అనారోగ్య సమస్యలు బాధిస్తాయి.

కుంభం: సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. బంధు మిత్రుల నుండి విలువైన వస్తువులు బహుమతులు పొందుతారు. నిరుద్యోగులకు నూతన ఉద్యోగ లాభం కలుగుతుంది. సంతానం విద్యా విషయాల సంతృప్తికరంగా సాగుతాయి. మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటారు.


మీనం: ఇంటా బయట కొన్ని వ్యవహారాలలో జాగ్రత్తగా ఉండాలి. వృధా ఖర్చులు పెరుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో స్థానచలన సూచనలున్నవి. ఇతరులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ప్రయాణాలలో మార్గ అవరోధాలు కలుగుతాయి. ఆర్థిక వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు మంచిది కావు.



# నెత్తికి ఎక్కట్లేదా?

మొదటి పేజీ తరువాయి

వారిపై 2 వారాల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఈ క్రమంలో స్పీకర్ తరఫు న్యాయవాది.. మిగతా ముగ్గురు ఎమ్మెల్యేల విచారణ పూర్తి చేసేందుకు 4 వారాల సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీంతో ఇప్పటికే స్పీకర్‌కు చాలా సమయం ఇచ్చామని, ఇదే చివరి అవకాశం అని స్పష్టం చేసింది. ఇంకా ఆలస్యం చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించింది. స్పీకర్ రెండు వారాల్లోగా ఒక అఫిడవిట్ దాఖలు చేయాలని కోర్టు ఆదేశించింది. అందులో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి తీసుకున్న చర్యలు, పురోగతిని వివరించాలని సూచించింది. రెండు వారాల తర్వాత తదుపరి విచారణ జరగనుంది. మిగిలిన కేసుల్లో స్పష్టమైన పురోగతి కనిపిస్తే, అదనపు సమయం గురించి తర్వాత ఆలోచిస్తామని సుప్రీంకోర్టు బదులిచ్చింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల్లో.. దానం నాగేందర్, కడియం శ్రీహరి, సంజయ్‌లపై అనర్హత పిటిషన్లపై ఇంకా నిర్ణయం వెలువడలేదు. ఇతర కేసుల్లో, పార్టీ మారినట్లు సరైన ఆధారాలు లేకపోవడంతో స్పీకర్ వారి పిటిషన్లను కొట్టివేశారు. స్పీకర్ తీసుకున్న నిర్ణయాలలోని లోపాలను ఈ దశలో తాము పరిశీలించలేమని కోర్టు స్పష్టం చేసింది. ఏవైనా అభ్యంతరాలు ఉంటే, ప్రత్యేక న్యాయ ప్రక్రియల ద్వారా లేవనెత్తాలని సూచించింది.



# ట్యాపింగ్ తాత్సారం ఇంకెన్నాళ్లు?

మొదటి పేజీ తరువాయి

పిలిచి విచారణ చేయవచ్చని, ప్రభాకర్‌రావు దర్యాప్తుకు సహకరిస్తారని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కేసు దర్యాప్తును దృష్టిలో ఉంచుకొని ఆర్టికల్ 142 కింద మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసినట్లు కోర్టు వెల్లడించింది. తదుపరి విచారణ వరకు ప్రభాకర్‌రావుకు ఇచ్చిన మధ్యంతర రక్షణను పొడిగిస్తున్నట్లు తెలిపింది. ఈ కేసు తదుపరి విచారణను మార్చి 10కి వాయిదా వేసింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు.

# బీజేపీ 'పుర'నాదం

**28 కార్పొరేషన్లలో విజయదుందుభి**

ముంబై: మహారాష్ట్రలో జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ ప్రభంజనం సృష్టించింది. ముంబై మినహా రాష్ట్రవ్యాప్తంగా 28 కార్పొరేషన్లకు వెలువడిన ఫలితాల్లో అత్యధిక చోట్ల బీజేపీ స్పష్టమైన మెజారిటీ సాధించడం లేదా అతిపెద్ద పార్టీగా అవతరించడం విశేషం. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన కూడా పలు కీలక నగరాల్లో తన పట్టును నిలుపుకుంది. మరోవైపు, కాంగ్రెస్, శరద్ పవార్-అజిత్ పవార్ వర్గాలుగా చీలిన నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ), ఉద్ధవ్ థాకరే వర్గం శివసేన (యూబీటీ), ఏఐఎంఐఎం వంటి పార్టీలు కొన్ని ప్రాంతాల్లో మాత్రమే విజయాలు సాధించగలిగాయి. మొత్తం మీద ఈ ఎన్నికల ఫలితాలు మహారాష్ట్ర పట్టణ ఓటర్లు బీజేపీ వైపు బలంగా మొగ్గు చూపినట్లు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా పుణె, నాగ్‌పూర్, సోలాపూర్, నాసిక్ వంటి కీలక నగరాల్లో బీజేపీ స్పష్టమైన మెజారిటీ సాధించి సత్తా చాటింది. 165 స్థానాలున్న పుణే కార్పొరేషన్‌లో బీజేపీ ఏకంగా 123 సీట్లు గెలుచుకోగా, 151 సీట్లున్న నాగ్‌పూర్‌లో 102 స్థానాల్లో జయకేతనం ఎగురవేసింది. షోలాపూర్‌లోని 102 సీట్లకు గానూ 87 చోట్ల, నాసిక్‌లో 122 సీట్లకు 72 చోట్ల గెలిచి తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శిం చింది. పింప్రి-చించ్‌వాడ్, మీరా-భయందర్, పన్వేల్, ధులే, జల్గావ్‌లలో కూడా కమలం పార్టీ స్పష్టమైన మెజారిటీని కైవసం చేసుకుంది. ఏక్‌నాథ్ షిండే వర్గం తన పట్టు నిలుపుకుంది. ఆయన సొంత ఇలాకా అయిన థానేలో 131 స్థానాలకు గానూ 50 సీట్లు గెలిచి కార్పొరేషన్‌పై పట్టు నిలుపుకుంది. కళ్యాణ్-డోంబివిలిలో 122 స్థానాలకు గానూ షిండే సేన 55 సీట్లతో అతిపెద్ద పార్టీగా నిలిచింది. ఛత్రపతి శంభాజీనగర్‌లో బీజేపీ 58 సీట్లతో అతిపెద్ద పార్టీగా నిలవగా, ఏఐఎంఐఎం 33 సీట్లతో రెండో స్థానంలో నిలిచింది. విపక్షాల విషయానికొస్తే, కొల్హాపూర్‌లో కాంగ్రెస్ 35 సీట్లతో అతిపెద్ద పార్టీగా నిలిచినా, అధికార మహాయుతి కూటమికి మెజారిటీ దక్కింది. లాతూర్‌లో కాంగ్రెస్ 70 సీట్లకు గానూ 43 గెలుచుకుని స్పష్టమైన మెజారిటీ సాధించింది. చంద్రపూర్‌లో 32 సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించింది. పర్భణీలో ఉద్ధవ్ థాకరే వర్గం శివసేన 25 సీట్లతో ముందు నిలిచింది. కొన్ని స్థానిక పార్టీలు కూడా తమ ప్రభావం చూపాయి. వసయ్-విరార్‌లో బహుజన్ వికాస్ అఘాడీ, మాలేగావ్‌లో స్థానిక పార్టీ ఇస్లామ్ మెజారిటీ సాధించాయి. మొత్తం మీద ఈ ఫలితాలు బీజేపీకి భారీ ఉత్తేజాన్ని ఇవ్వగా, విపక్షాలకు మిశ్రమ ఫలితాలను అందించాయి

# మేడారంలో కేబినెట్ భేటీ

మొదటి పేజీ తరువాయి

సంప్రదాయానికి భిన్నంగా ఒక మారుమూల గ్రామంలో నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. అది కూడా కోట్లాది మంది భక్తులు అత్యంత విశ్వసించే మేడారం గ్రామంలో నిర్వహించాలని నిర్ణయించింది. హైదరాబాద్ కాకుండా ఓ మారుమూల గ్రామంలో కేబినెట్ భేటీ కావటం ఇదే తొలిసారి అని చెప్పొచ్చు. మేడారంలో జరగబోయే కేబినెట్ భేటీపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇప్పటికే మేడారంలో శాశ్వత ప్రాతిపాదికన అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇందుకోసం భారీగానే నిధులు కేటాయించారు. అయితే కేబినెట్ భేటీలో మరిన్ని నిధులపై ప్రకటన ఏమైనా ఉంటుందా అనే చర్చ కూడా ఉంటుంది. అంతేకాకుండా రైతు భోరోసా, హ్యామ్ రోడ్ల నిర్మాణం, మున్సిపల్ ఎన్నికలతో పాటు మరికొన్ని ముఖ్యమైన అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ నెల 28న ప్రారంభం కానున్న సమ్మక్క - సారక్క మహా జాతర ప్రారంభమై 31వ తేదీన ముగుస్తుంది. ఇక ఈనెల 18న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వనదేవతలు సమ్మక్క, సారలమ్మలను దర్శించుకునేందుకు మేడారం వెళ్తారు. 19న ఉదయం పలు అభివృద్ధి పనుల్ని ప్రారంభిస్తారు.

**ఇదే తొలిసారి: పొంగులేటి**

రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయేలా ఈ నెల 18న మేడారంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం (క్యాబినెట్ మీటింగ్) నిర్వహించనున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఎన్నడూ లేని విధంగా హైదరాబాద్ వెలుపల క్యాబినెట్ భేటీ జరగడం ఇదే ప్రథమమని పేర్కొన్నారు. "గత ప్రభుత్వంలా ఎన్నికల వేళ బొమ్మలు చూపడం మా అలవాటు కాదు.. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ పనిచేసే ప్రభుత్వమిది" అని స్పష్టం చేశారు. సమ్మక్క-సారలమ్మ జాతరను కుంభమేళా కంటే అద్భుతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని మంత్రి తెలిపారు. మేడారంలో కాకతీయుల నాటి వైభవం ఉట్టిపడేలా నిర్మించిన రాతి కట్టడాలను 19వ తేదీ ఉదయం ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని వెల్లడించారు. అలాగే గడువు ముగిసిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు త్వరలోనే ఎన్నికలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

# మోదీని మళ్లీ మళ్లీ కలుస్తా

మొదటి పేజీ తరువాయి

చేశారు. ఆదిలాబాద్ జిల్లా అంటే తనకు ఎంతో ప్రత్యేకమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ జిల్లాకు అందాల్సిన న్యాయం, జరగాల్సిన అభివృద్ధి గతంలో సరిగా జరగలేదని వ్యాఖ్యానించారు. పాలమూరు జిల్లాతో సమానంగా ఆదిలాబాద్ జిల్లాకు కూడా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఇప్పటివరకు విశ్వవిద్యాలయం లేకపోవడం దురదృష్టకరమని పేర్కొంటూ, ఈ ప్రాంతానికి వర్సిటీ మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. త్వరలోనే విశ్వవిద్యాలయానికి అధికారిక ఆమోదం వస్తుందని, బాసరలో వర్సిటీ ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఉమ్మడి జిల్లాకు అవసరమైన అన్ని నిధులను బడ్జెట్‌లో పొందుపరుస్తామని హామీ ఇచ్చారు. తుమ్మడి హెట్టి వద్ద ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టుపై సమగ్ర నివేదిక సిద్ధం చేస్తున్నామని, అక్కడే ప్రాజెక్టును నిర్మించి తీరుతామని సీఎం స్పష్టం చేశారు. ఆదిలాబాద్‌లో ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే ఆదిలాబాద్‌కు విమానాశ్రయం తీసుకొచ్చే పూర్తి బాధ్యత తనదేనని ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు శిలాఫలకం వేయిస్తామని ధీమా వ్యక్తం చేశారు. వరంగల్‌కు ఎయిర్‌పోర్ట్ మంజూరు చేసినట్లే ఆదిలాబాద్‌కూ ఇస్తామని కేంద్రం చెప్పిందని సీఎం గుర్తు చేశారు. అడిగితేనే అభివృద్ధి వస్తుందని, గత పాలకులు అడగకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని విమర్శించారు. వారి పాలన వల్ల అప్పులు మిగిలాయని, నాడు ఇచ్చిన బియ్యం ఎవరు తిన్నారో తెలియదని, కానీ ఇప్పుడు ప్రభుత్వం ఇస్తున్న సన్నబియ్యం ప్రజలు తింటున్నారని అన్నారు. సున్నా వడ్డీ పేరుతో గుండు సున్నా మిగిల్చారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజలు అండగా నిలిస్తే దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతానని సీఎం రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. త్వరలో మున్సిపల్ ఎన్నికలు రాబోతున్నాయని, ప్రజా ప్రభుత్వంతో కలిసి పనిచేసే వారినే గెలిపించాలని కోరారు.

# భూభారతి స్కాం..

మొదటి పేజీ తరువాయి

(జనగామ), 6. కోదురి శ్రావణ్ వయసు: 35 సంవత్సరాలు (జనగామ), 7. కొలిపాక సతీష్ కుమార్ వయసు: 36 సంవత్సరాలు, కొడకండ్ల (ఎం), జనగామ. 8. తదూరి రంజిత్ కుమార్ వయసు 39 సంవత్సరాలు, నర్మెట్ట, జనగామ. 9. దుంపల కిషన్ రెడ్డి, వయసు: 29 సంవత్సరాలు, ఆత్మకూర్ (ఎం), యాదాద్రి జిల్లా, 10. దశరథ మేఘావత్ వయసు: 28 సంవత్సరాలుతురుపల్లి. 11. నారా భాను ప్రసాద్, వయసు: 30 సంవత్సరాలు, యాదగిరిగుట్ట, 12. గొపగాను శ్రీనాథ్, వయసు: 32 సంవత్సరాలు, శివ కుమార్, వయస్సు 33, అమంగల్, నల్లగొండ. 13. ఒగ్గు కర్నాకర్, వయసు: 42 సంవత్సరాలు, యాదాద్రి జిల్లా. 14. కమల్ల 15. అలేటి నాగరాజు, వయస్సు 32, (యాదాద్రి జిల్లా)కు చెందిన వారు ఉన్నారని పోలీసులు గుర్తించారు. భారీ కుంభకోణానికి పాల్పడిన నిందితులు వివరాలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ వివరాలను మీడియాకు వెల్లడించారు. 'ప్రధాన నిందితులైన పసునూరి బసవరాజు, జెల్లా పాండు ఇరువురు యాదాద్రి-భువనగిరి జిల్లా యాదగిరి గుట్టలో అన్‌లైన్ సర్వీస్ నిర్వహించేవారు. నిందితుల్లో ఒకడైన గణేష్ తనకు తాను అన్‌లైన్ సెంటర్లతో పరిచయం చేసుకోని చెల్లించాల్సన మొత్తాన్ని ఏన్.ఆర్.ఐ ఖాతా ద్వారా పే చేస్తానని నమ్మించి.. రైతుల నుండి మొత్తం డబ్బులను మీ సేవ వ్యక్తుల ద్వారా వసూలు చేయించేవాడు. అలా వసూలు చేసిన డబ్బును అన్‌లైన్ సర్వీస్ వ్యక్తులకు, మధ్యవర్తులకు కమిషన్ చొప్పున డబ్బు అందజేస్తూ ఈ చలాన్లను ప్రధాన నిందితుడికి పంపిచేవాడు. ఇలా వచ్చిన చలాన్లను బసవరాజు ధరణీ/భూభారతీ వెబ్‌సైట్లో ఇన్‌స్పెక్ట్ " ఎడిట్ అప్లికేషన్ ఉపయోగించి చలాన్ల రుసుము తగ్గించేవాడు. అనంతరం అట్టి ఛలాన్‌ను మొబైల్ ద్వారా ఎడిట్ చేసి తిరిగి రైతులకు పంపేవాడు. ఇదే క్రమంలో నిందితులు మొబైల్ ఆప్లికేషన్‌ను ఉపయోగించి ప్రభుత్వానికి చెల్లించిన రుసుముకు సంబంధించి వెబ్‌సైట్లో జారీ అయిన రసీదులను చెల్లించాల్సిన దాని కంటే తక్కువగా మార్పు చేసేవారు. అనంతరం మార్పు చేసిన రుసుమును మాత్రమే ప్రభుత్వానికి చెల్లించి.. నకిలీ చలాన్లను స్థానిక యం.ఆర్.ఓ/ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో మధ్యవర్తుల ద్వారా సమర్పిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ మోసాలకు పాల్పడేవారు. ఈ విధంగా ప్రధాన నిందితులు ఇద్దరు సులభంగా డబ్బు సంపాదించడానికి అలవాటు పడ్డారు. జనగామ, యాదాద్రి జిల్లాల్లో మీ సేవ, ఆన్లైన్ సర్వీసులు, మధ్యవర్తుల వద్ద నమోదు కావాల్సిన ధరణీ, భూ భారతి రిజిస్ట్రేషన్ పత్రాలను ప్రధాన నిందితులు తమ వద్దనే వెబ్‌సైట్లో నమోదు చేసేవారు. ఇందుగాను మిగితా వారికి 10 శాతం నుండి 30 శాతం వరకు కమీషన్ చెల్లించేవారు. ఈ కేసుకు సంబంధించి జనగామ, యాద్రాద్రి జిల్లాల్లో 1,080 పత్రాలకు సంబంధించిన లావాదేవీల్లో నిందితులు మోసాలకు పాల్పడ్డారు.

# యూపీఐ ద్వారా పీఫ్ విత్‌డ్రా

మొదటి పేజీ తరువాయి

మంత్రిత్వ శాఖ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం పీఎఫ్ డబ్బులు విత్‌డ్రా చేయాలంటే క్లెయిమ్ ఫారమ్‌లు సమర్పించాల్సి ఉండగా, ఈ ప్రక్రియకు కొంత సమయం పడుతోంది. అయితే, కొత్త విధానం అమల్లోకి వస్తే, సభ్యులు తమ లింక్ అయిన బ్యాంకు ఖాతాకు యూపీఐ పిన్ ఉపయోగించి సులభంగా, వేగంగా నగదు బదిలీ చేసుకోవచ్చు. ఈ వ్యవస్థను సజావుగా అమలు చేయడానికి ఈపీఎఫ్‌వో అవసరమైన సాఫ్ట్‌వేర్ మార్పులు చేస్తోంది. ఇప్పటికే ఆటో-సెటిల్‌మెంట్ విధానంలో అనారోగ్యం, విద్య, వివాహం, గృహ నిర్మాణం వంటి అవసరాల కోసం చేసుకునే క్లెయిమ్‌లను 3 రోజుల్లోనే పరిష్కరిస్తున్నారు. ఈ విధానంలో పరిమితిని రూ.1 లక్ష నుంచి రూ.5 లక్షలకు పెంచారు. దీనికి తోడు, పాక్షిక ఉపసంహరణ నిబంధనలను కూడా సరళీకరించారు. గతంలో ఉన్న 13 సంక్లిష్ట నియమాలను మూడు సాధారణ కేటగిరీలుగా మార్చారు. కొత్త నిబంధనల ప్రకా రం, సభ్యులు తమ ఖాతాలోని అర్హత ఉన్న బ్యాలెన్స్‌లో 100 శాతం వరకు విత్‌డ్రా చేసుకోవచ్చు. అయితే, సభ్యులు చక్రవడ్డీ ప్రయోజనాలు, 8.25 శాతం వడ్డీ రేటును నష్టపోకుండా ఉండాలంటే మాత్రం ఖాతాలో కనీసం 25 శాతం నిల్వలను కొనసాగించాల్సి ఉంటుంది.

# ఫిబ్రవరి 1న స్టాక్ మార్కెట్లు ఓపెన్

మొదటి పేజీ తరువాయి

ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) ప్రకటించాయి. ఈ మేరకు శుక్రవారం ప్రత్యేక సర్క్యులర్లను జారీ చేశాయి. ఫిబ్రవరి 1న ఉదయం 9:15 గంటల నుంచి మధ్యాహ్నం 3:30 గంటల వరకు సాధారణ ట్రేడింగ్ సెషన్ జరుగుతుందని ఎన్ఎస్ఈ తన సర్క్యులర్‌లో పేర్కొంది. ఈక్విటీ సెగ్మెంట్‌తో పాటు ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్, కమోడిటీ డెరివేటివ్స్ విభాగాల్లోనూ ట్రేడింగ్ ఉంటుందని స్పష్టం చేసింది. అయితే, టీ ప్లస్ జీరో సెటిల్‌మెంట్ సెషన్, ఆక్షన్ సెషన్ మాత్రం ఆ రోజు ఉండవని బీఎస్ఈ తెలిపింది. సాధారణంగా శని, ఆదివారాల్లో స్టాక్ మార్కెట్లకు సెలవు ఉంటుంది. అయితే, బడ్జెట్ వంటి కీలక ఘట్టం కారణంగా ఈ ప్రత్యేక ఏర్పాటు చేశారు. 2000 సంవత్సరం తర్వాత బడ్జెట్‌ను ఆదివారం ప్రవేశపెట్టడం ఇదే మొదటిసారి. గతంలో 2015, 2025 బడ్జెట్‌లను శనివారాల్లో ప్రవేశపెట్టినప్పుడు కూడా మార్కెట్లను తెరిచే ఉంచారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జనవరి 28న ప్రారంభమై ఏప్రిల్ 2 వరకు రెండు విడతలుగా కొనసాగుతాయని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు.

# 242 వెబ్‌సైట్ లింకులు బ్లాక్

మొదటి పేజీ తరువాయి

చేసింది. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం.. ఇప్పటివరకు 7,800కు పైగా అక్రమ ఆన్‌లైన్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ వెబ్‌సైట్లు దేశవ్యాప్తంగా గుర్తించి టేక్‌డౌన్ చేశారు. ప్రత్యేకంగా ఆన్‌లైన్ గేమింగ్ యాక్ట్ అమలులోకి వచ్చిన తర్వాత ఈ చర్యలు మరింత వేగం పుంజుకున్నాయి. ఈ అక్రమ వెబ్‌సైట్లు ముఖ్యంగా యువతను లక్ష్యంగా చేసుకుని డబ్బు ఆశ చూపిస్తూ వారిని వ్యసనాల బాట పట్టిస్తున్నాయని కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. దీని వల్ల ఆర్థిక నష్టాలతో పాటు సామాజిక సమస్యలు పెరుగుతున్నాయని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. తాజాగా తీసుకున్న చర్యలు వినియోగదారుల భద్రతను కాపాడడం కోసమేనని ప్రభుత్వం వర్గాలు స్పష్టం చేశాయి. యువతను ఆన్‌లైన్ బెట్టింగ్ మాయలో పడకుండా చేయడం, అక్రమ ఆర్థిక కార్యకలాపాలకు చెక్ పెట్టడం లక్ష్యంగా మరింత అగ్రెసీవ్‌గా ముందుకు వెళ్తామని ప్రభుత్వం పేర్కొంది. భవిష్యత్తులో కూడా అక్రమ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ ప్లాట్‌ఫాంలపై నిరంతర నిఘా, అవసరమైతే మరింత కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి.

# 20న బీజేపీకి నూతన అధ్యక్షుడు

మొదటి పేజీ తరువాయి

అధికారిక పత్రికా ప్రకటన జారీ చేస్తామని, అనంతరం మరుసటి రోజు ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల మధ్య ఢిల్లీలో కొత్త అధ్యక్షుడి పేరును ప్రకటిస్తామని లక్ష్మణ్ తెలిపారు. బీహార్‌కు చెందిన నితిన్ నబీన్ ఇటీవల పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆయననే నూతన అధ్యక్షుడిగా ఎన్నుకోవాలని బీజేపీ భావిస్తోందని సమాచారం. యువ నాయకత్వాన్ని తయారు చేసుకోవడంలో భాగంగా నబీన్‌కు పార్టీ సారథ్య బాధ్యతలను అప్పగించే అవకాశాలు ఉన్నాయి. నబీన్ బీహార్‌లో ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. బీహార్ ప్రభుత్వంలో మంత్రిగా పని చేశారు. గతంలో సిక్కిం, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లో ఇన్‌ఛార్జ్ బాధ్యతలు నిర్వర్తించారు.




# ఎఫ్టీఎల్, బఫర్ జోన్ టీడీఆర్ పెంపు

**తెలంగాణ సర్కారు కీలక నిర్ణయం**

హైదరాబాద్, జనవరి 16 (ఈవార్తలు): చెరువులు, నదులు, నాలాల పరిరక్షణతో పాటు, ఆయా పరిధిలోని భూ యజమానులకు ఊరటనిచ్చేలా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మెట్రోపాలిటన్ ఏరియా, పట్టణాభివృద్ధి శాఖ (ఎంఏ అండ్ యూడీ) జి.ఓ.ఎం.ఎస్. నెం.16 ద్వారా భవన నిర్మాణ నిబంధనలు--2012లో సవరణలు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. జలాశయాల ఆక్రమణల తొలగింపు, సుప్రీంకోర్టు, ఎన్జీటీ ఆదేశాల నేపథ్యంలో.. నిర్మాణాలకు అనుమతి లేని ఎఫ్టీఎల్, ఎంఎఫ్ఎల్, బఫర్ జోన్లలోని భూములకు బదులుగా ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) జారీ చేసే విధానంలో భారీ మార్పులు చేసింది. పర్యావరణ పరిరక్షణ, భూ యజమానుల ప్రయోజనాల మధ్య సమతుల్యత సాధించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. కేవలం ప్రభుత్వ లేదా ప్రభుత్వ అనుబంధ సంస్థలు (హైడ్రా, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ తదితర) నోటిఫై చేసిన ప్రాజెక్టులకు మాత్రమే ఈ సవరణలు వర్తిస్తాయని స్పష్టం చేసింది. గతంలో ఎఫ్టీఎల్, బఫర్ జోన్లకు సమానంగా టీడీఆర్ ఉండేది. తాజా సవరణలో దీనిని హేతుబద్ధీకరించి, భూమిని స్వచ్ఛందంగా అప్పగించే వారికి ప్రోత్సాహకాలు పెంచారు. అభివృద్ధి అనుమతులు ఇవ్వలేని ఎఫ్టీఎల్, ఎంఎఫ్ఎల్ బఫర్ జోన్ల భూముల విషయంలో భూ యజమానులకు ప్రత్యామ్నాయంగా టీడీఆర్ ఇవ్వడం ద్వారా




పర్యావరణ పరిరక్షణతో పాటు సమతుల్యత సాధించాలన్నదే లక్ష్యంగా వెల్లడించింది. టీడీఆర్‌కు మార్కెట్‌లో డిమాండ్ పెంచే ఉద్దేశంతో, 10 అంతస్తులకు మించిన హైరరైజ్ భవనాల్లో 10వ అంతస్తు పైగా ఉన్న నిర్మిత విస్తీర్ణంలో 10 శాతం టీడీఆర్ వినియోగం తప్పనిసరిగా ప్రభుత్వం నిర్ణయించింది.

**టీడీఆర్ మంజూరు కోసం నిబంధనలివే..**

- చెరువుల ఎఫ్టీఎల్, నదుల ఎంఎఫ్ఎల్ పరిధిలో ఉన్న భూములకు- వదులుకున్న నిర్మిత విస్తీర్ణానికి 200 శాతం టీడీఆర్.
- చెరువులు, నదుల బఫర్ జోన్లలో ఉన్న భూములకు- 300 శాతం టీడీఆర్.
- జలవనరుల అభివృద్ధి లేదా రహదారి విస్తరణ వంటి ప్రజాప్రయోజనాల కోసం అవసరమైన భూములకు- 400 శాతం టీడీఆర్.
- ప్రైవేటు భూముల్లో నాలా విస్తరణ జరిగితే, రోడ్డు విస్తరణతో సమానంగా 400 శాతం టీడీఆర్ వర్తింపు.
- భూమి యజమానులు భూమిని ఉచితంగా ప్రభుత్వానికి అప్పగిస్తే, మిగిలిన భూమిలో సెట్‌బ్యాక్‌ల సడలింపు, అదనపు అంతస్తులు లేదా అదనపు నిర్మాణ విస్తీర్ణం పొందే వెసులుబాటు కూడా కల్పించారు. అయితే ఇవన్నీ ఫైర్, ఎయిర్‌పోర్ట్ తదితర సంబంధిత అనుమతులకు లోబడి ఉంటాయని స్పష్టం చేశారు.

**అధికారుల క్లియరెన్స్ కచ్చితం**

నీటి వనరులకు సంబంధించిన భూములకు టీడీఆర్ జారీ చేయడానికి ముందు.. ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రెవెన్యూ శాఖ అడిషనల్ కలెక్టర్ ర్యాంకు తగ్గని అధికారుల నుంచి క్లియరెన్స్ తీసుకోవాలి. భూమి టైటిల్, ఎఫ్టీఎల్ పరిధిపై స్పష్టత వచ్చాకే టీడీఆర్ మంజూరు చేస్తారు. ఒకవేళ భూ యజమాని అందుబాటులో లేకపోయినా, భూమిపై టైటిల్ వివాదాలు ఉన్నా.. ఆ భూమికి సంబంధించిన టీడీఆర్‌ను 'టీడీఆర్ బ్యాంక్‌లో జమ చేస్తారు. వివాదం పరిష్కారమయ్యాక లేదా యజమాని సరైన పత్రాలతో వచ్చినప్పుడు దానిని జారీ చేస్తారు. ఒక ఎకరం కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న బల్క్ ల్యాండ్స్ విషయంలో టీడీఆర్ ఇవ్వాలంటే ముందస్తుగా ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. మార్కెట్‌లో టీడీఆర్‌కు డిమాండ్ పెంచేందుకు ప్రభుత్వం కీలక నిబంధన పెట్టింది. 10 అంతస్తులకు మించి నిర్మించే ఆకాశహర్మ్యాల్లో (హై రైజ్ బిల్డింగ్స్).. 10వ అంతస్తు పైన నిర్మించే విస్తీర్ణంలో 10 శాతానికి సరిపడా టీడీఆర్‌ను కచ్చితంగా వినియోగించుకోవాల్సి ఉంటుంది. ఈ సవరణలు తక్షణం అమల్లోకి వస్తాయని పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## క్లీన్ చిట్ ఎలా ఇచ్చారు?

**ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంపై సుప్రీంకు టీబీజేపీ**

న్యూఢిల్లీ/హైదరాబాద్, జనవరి 16 (ఈవార్తలు): తెలంగాణలో ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారానికి సంబంధించి బీజేపీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. గత శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలుపొంది, ఆ తరువాత కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు ఎమ్మెల్యేలకు స్పీకర్ ప్రసాద్ కుమార్ క్లీన్‌చిట్ ఇవ్వడాన్ని బీజేపీ సవాల్ చేసింది. కాలె యాదయ్య, పోచారం శ్రీనివాస్ రెడ్డితో సహా పలువురు ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్ చిట్ ఇవ్వడాన్ని బీజేపీ నేతలు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. బీజేపీ శాసనసభా క్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల విషయంలో మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ, స్పీకర్ ఆ సూచనను పాటించలేదని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు.




# ప్రమాదంలో సికింద్రాబాద్ అస్తిత్వం

**తుగ్లక్ పాలనలా రేవంత్ పాలన**

**మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**

సికింద్రాబాద్, జనవరి 16 (ఈవార్తలు): సికింద్రాబాద్‌కు శతాబ్దాలుగా ఉన్న ప్రత్యేక చరిత్రను ఎవ్వరూ మరిచిపోలేరని మాజీ మంత్రి, సనత్‌నగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సికింద్రాబాద్‌కు చెందిన నార్త్ జోన్ ప్రాంతాలను తీసుకెళ్లి మల్కాజిగిరిలో కలిపేశారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది సికింద్రాబాద్ అస్తిత్వానికే ప్రమాదంగా మారుతోందని వ్యాఖ్యానించారు. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు గట్టిగా ఒత్తిడి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోవడాన్ని కప్పిపుచ్చుకోవడానికే సీఎం రేవంత్ రెడ్డి ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారని తలసాని విమర్శించారు. అసలు సమస్యలపై దృష్టి పెట్టకుండా తుగ్లక్ పాలనలా వ్యవహరించడం సరికాదని సూచించారు. సికింద్రాబాద్ పేరును మార్చేందుకు కూడా కుట్ర జరుగుతోందని ఆరోపించారు. సికింద్రాబాద్ అనేది కేవలం ఒక ప్రాంతం మాత్రమే కాదని, ఇక్కడి ప్రజలకు అది ఒక భావోద్వేగమని చెప్పారు. తమ గుర్తింపు, అస్తిత్వాన్ని కాపాడుకోవాల్సిన కీలక సమయంలో ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. సికింద్రాబాద్ కార్పొరేషన్ జిల్లా ఏర్పాటు కోసం చేపడుతున్న శాంతియుత ర్యాలీని ప్రజలందరూ కలిసి విజయవంతం చేయాలని తలసాని కోరారు. ఒకవేళ ప్రభుత్వం ఈ ర్యాలీకి అనుమతి ఇవ్వకపోతే, కోర్టును ఆశ్రయించి అనుమతి తీసుకుంటామని తెలిపారు.

# మెట్రో-2 మొదలెట్టండి

**సీఎం రేవంత్‌కు కిషన్ రెడ్డి లేఖ**

హైదరాబాద్, జనవరి 16 (ఈవార్తలు): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ రాశారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ పనుల పురోగతిపై ఆయన ఈ లేఖ రాశారు. మెట్రోను ఎల్ అండ్ టీ నుండి స్వాధీనం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహిస్తుందని మీరే ప్రకటించారని రేవంత్ రెడ్డికి గుర్తు చేశారు. మెట్రో రెండో దశ నిర్మాణం గురించి తాను కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కలిసి చర్చించానని, అయితే ముందుగా మొదటి దశ మెట్రోను ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకోవాలని ఆయన సూచించారని అన్నారు. ఇందుకు సంబంధించి నిర్ణయాలు, లావాదేవీలు పూర్తి కావాలని, ఆ తర్వాత రెండో దశ మెట్రో నిర్మాణంపై కేంద్రం చర్యలు తీసుకుంటుందని అన్నారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ నిర్మాణానికి కేంద్రం అంగీకరించిందని ఆ లేఖలో కిషన్ రెడ్డి పేర్కొన్నారు. మెట్రో మొదటి దశను ఎల్ అండ్ టీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవడం, రెండో దశకు సన్నాహాల కోసం కేంద్రం, రాష్ట్రం కలిసి సంయుక్తంగా కమిటీ ఏర్పాటు చేయడంపై ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయించినట్లు కూడా ఖట్టర్ తనకు తెలిపారని అన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇద్దరు, కేంద్ర ప్రభుత్వం తరఫున ఇద్దరు అధికారులతో కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారని, కానీ ఇంత వరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారుల పేర్లను ప్రతిపాదించలేదని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అధికారుల పేర్లను పంపించాలని కోరారు.





# టీఎస్ ఐపాస్‌కు నీతి ఆయోగ్ ప్రశంసలు

**యావత్ తెలంగాణకు గర్వకారణం: కేటీఆర్**

**2.6 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని వెల్లడి**

హైదరాబాద్, జనవరి 16 (ఈవార్తలు): తమ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కేసీఆర్ రూపకల్పన చేసిన టీఎస్ ఐపాస్ విధానం దేశంలోనే అత్యుత్తమమైనదని సాక్షాత్తు నీతి ఆయోగ్ తన తాజా నివేదికలో ప్రశంసించడం తెలంగాణకు గర్వకారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. పారిశ్రామిక రంగంలో తెలంగాణ సాధించిన ప్రగతి, కేసీఆర్ దార్శనికతకు ఈ గుర్తింపే నిలువెత్తు నిదర్శనమని తెలిపారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణను పదేళ్ల కాలంలోనే దేశానికే పారిశ్రామిక దిక్సూచిగా మార్చడంలో టీఎస్ ఐపాస్ పోషించిన పాత్ర అత్యంత కీలకమని కేంద్ర ప్రభుత్వ సంస్థే చెప్పడం గొప్ప విషయమని ఆయన అభిప్రాయపడ్డారు. పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అడ్డంకులను తొలగించి, సింగిల్ విండో విధానంలో కేవలం 15 నుంచి 30 రోజుల్లోనే అన్ని అనుమతులు ఇచ్చేలా టీఎస్ ఐపాస్‌ను రూపొందించామని కేటీఆర్ గుర్తుచేశారు. అవినీతికి ఏమాత్రం తావులేని అత్యంత పారదర్శకమైన ఈ విధానాన్ని పదేళ్లపాటు చిత్తశుద్ధితో అమలు చేయడం వల్లే అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని వివరించారు. ఈ విధానం ద్వారా భారీ పరిశ్రమలతో పాటు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల విభాగంలో రూ. 2.6 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని తెలిపారు. తద్వారా రాష్ట్రంలో 25 లక్షల మందికి పైగా యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా గౌరవప్రదమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం దేశ చరిత్రలోనే ఒక సువర్ణ అధ్యాయమని వ్యాఖ్యానించారు. గతంలో తమ ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, టీ-హబ్ వంటి వినూత్న కార్యక్రమాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించినట్లే, ఇప్పుడు టీఎస్ ఐపాస్‌కు కూడా లభించిందని కేటీఆర్ తెలిపారు. ప్రపంచ దిగ్గజ సంస్థల నుంచి చిన్న పరిశ్రమల వరకు తెలంగాణ వైపు చూసేలా పెట్టుబడిదారుల్లో ఈ విధానం కొండంత విశ్వాసాన్ని నింపిందన్నారు. "ఇకనైనా కేసీఆర్ గారి ఆనవాళ్లు చెరిపేస్తామనే భ్రమల్లో బతికే అరాచక శక్తులు బుద్ధి తెచ్చుకుంటే మంచిది" అని పరోక్షంగా ప్రస్తుత ప్రభుత్వంపై ఆయన విమర్శలు గుప్పించారు. తెలంగాణ మోడల్ ఆచరణీయమని నీతి ఆయోగ్ చెప్పిన తర్వాత కూడా విమర్శలు చేయడం తగదని హితవు పలికారు.

## నిజాం ఒక హంతకుడు

**బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్**



నిజామాబాద్, జనవరి 16 (ఈవార్తలు): నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలతో రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించారు. తాజాగా మీడియాతో మాట్లాడిన ఆయన... శ్రీరాముడికీ బీజేపీ మెంబర్‌షిప్ ఉందని, అనుమానం ఉంటే వెళ్లి చూసుకోవాలని టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్‌ను ఉద్దేశించి అన్నారు. నిజామాబాద్‌ను 'ఇందూర్‌'గా పిలవాలని ఎంపీ అర్వింద్ డిమాండ్ చేశారు. నిజాం ఒక హంతకుడని, అలాంటి వ్యక్తి పేరును నిజామాబాద్ కు ఎందుకు పెట్టుకుంటారని అన్నారు. ఇందూర్ అనే పేరు ఎలా వచ్చిందన్న దానిపై చారిత్రక ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. నిజామాబాద్ పేరు మార్చి ఇందూర్‌గా చేయాలని తీర్మానం చేసి, ఏబీవీపీ నుంచి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి పంపిస్తామని తెలిపారు. ముస్లింలంటే కాంగ్రెస్ అన్నట్టు మాట్లాడటం సరికాదని విమర్శించారు. పహల్గాం ఘటనను ప్రస్తావిస్తూ... అక్కడ హిందువులా, ముస్లింలా అని చూసి కాల్చి చంపారని గుర్తు చేశారు. కొంతమంది హిందువుల్లో కూడా చెడు ఉందని వ్యాఖ్యానించారు. తెలంగాణ మొత్తం త్వరలో కాషాయమయం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ ఎక్కడుందో తెలుసుకోవాలంటే కవితను అడిగితే చెబుతుందని ఎద్దేవా చేశారు. రేపు సిరిసిల్లలో కూడా బీజేపీ బలాన్ని చూపిస్తామని చెప్పారు. ఇందూర్‌కి దమ్ముంటే రా అంటూ కేటీఆర్‌కు సవాల్ విసిరారు. గతంలో కాంగ్రెస్ పాలనలోనే మత ఘర్షణలు జరిగాయని అర్వింద్ ఆరోపించారు. చెన్నారెడ్డి సీఎం పదవికి రాజీనామా చేసే వరకు రాష్ట్రంలో అల్లర్లు జరిగాయని తెలిపారు. అప్పట్లో ఏసీపీ సత్తయ్య హత్య కేసులో నిందితులను బయటకు తీసుకొచ్చింది మజ్లిస్ పార్టీయేనని ఆరోపించారు. తిన్న తిండి అరగక హిందూ దేవాలయాలపై దాడులు చేస్తున్నారని, దీనికి కారణం సీఎం రేవంత్ రెడ్డేనని విమర్శించారు. నిజాంను గాడిద అని అన్నందుకే రాద్ధాంతం చేస్తున్నారని, కానీ చరిత్రలో నిజాం ఎప్పటికీ దుర్మార్గమైన రాజుగానే మిగిలిపోతాడని అన్నారు. ఆయన పేరు వినగానే హిందువులకు గుర్తొచ్చేది ఆయన చేసిన మారణకాండేనని పేర్కొన్నారు. ముస్లింలకు ఇళ్లు, రేషన్, ఉచిత వ్యాక్సినేషన్ మోదీ ప్రభుత్వం ఇస్తోందని... ముస్లిం దేశాలకు కూడా వ్యాక్సిన్లు పంపించిందని తెలిపారు.

## శబరిమల నుంచి వస్తుండగా తెలుగు దంపతుల మృతి

**మృతులు లక్సెట్టిపేటకు చెందిన సత్యనారాయణ, రమాదేవి**

మంచిర్యాల, జనవరి 16 (ఈవార్తలు): తమిళనాడులోని కన్యాకుమారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన దంపతులు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే, మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటకు చెందిన పాలకుర్తి సత్యనారాయణ (63), రమాదేవి (59) తమ ఊళ్లో కిరాణా షాపును నిర్వహిస్తున్నారు. ఈ దంపతులు అయ్యప్ప స్వామి మాల ధరించారు. ఈ నెల 8న ఓ ప్రైవేట్ బస్సులో శబరిమల దర్శనానికి వెళ్లారు. నిన్న మకర సంక్రాంతి రోజున అయ్యప్ప స్వామి దర్శనం చేసుకున్నారు. అనంతరం తిరుగుపయనమయ్యారు. ఈ క్రమంలో కన్యాకుమారి వద్ద బైపాస్ రోడ్డులో బస్సును ఆపారు. అక్కడ సముద్ర స్నానం ముగించుకుని బస్సు దగ్గరకు వస్తుండగా సత్యనారాయణ, రమాదేవిని ఓ ప్రైవేట్ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వీరి మృతదేహాలను పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## మోడల్ స్కూళ్ల అడ్మిషన్ షెడ్యూల్ రిలీజ్

హైదరాబాద్, జనవరి 16 (ఈవార్తలు): రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాల షెడ్యూల్‌ను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ శుక్రవారం విడుదల చేశారు. ఆరవ తరగతిలో కొత్త ప్రవేశాలతో పాటు, 7 నుంచి 10వ తరగతి వరకు ఉన్న ఖాళీ సీట్ల భర్తీకి ఈ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. జనవరి 28 నుండి ఫిబ్రవరి 28 వరకు దరఖాస్తుల స్వీకరణకు అవకాశం కల్పించారు. ఏప్రిల్ 9 న హాల్ టికెట్ల డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశం కల్పించగా, ఏప్రిల్ 19 పరీక్ష నిర్వహించనున్నారు. 6వ తరగతి కి సంబందించి ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, 7 నుంచి 10వ తరగతి వరకు మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సంబంధిత మండలాల్లోని పాఠశాలల్లోనే పరీక్ష నిర్వహించబడతాయన్నారు. ఓసీ విద్యార్థులకు విద్యార్థులకు రూ. 200, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు రూ. 125 దరఖాస్తు ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ హ్ట్ట్ప్స్://టెలంగాణ్మ్స్.cగ్గ్.గోవ్.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని తెలిపారు.



## రంగంలోకి గల్ఫ్ దేశాలు

**ఇరాన్ పై నిర్ణయం మార్చుకున్న ట్రంప్**

దుబాయ్: ఇరాన్‌పై అమెరికా సైనిక దాడిని నివారించేందుకు మూడు గల్ఫ్ దేశాలు తీవ్రంగా దౌత్య ప్రయత్నాలు చేసి సఫలమయ్యాయి. ఇరాన్‌కు మరో అవకాశం ఇవ్వాలని సౌదీ అరేబియా, ఖతార్, ఒమన్ దేశాలు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఒప్పించాయి. ఈ కీలక పరిణామంతో గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలు ప్రస్తుతానికి సద్దుమణిగాయి. ఇరాన్‌లో ప్రభుత్వ వ్యతిరేక నిరసనలను కఠినంగా అణచివేస్తున్న నేపథ్యంలో ఆ దేశంపై సైనిక దాడి చేయాలని ట్రంప్ బలంగా భావించారు. ఈ క్రమంలో రంగంలోకి దిగిన గల్ఫ్ దేశాలు.. దాడి జరిగితే ప్రాంతీయంగా తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని హెచ్చరించాయి. ఈ మేరకు ఓ సీనియర్ సౌదీ అధికారి వెల్లడించారు. ఈ చివరి నిమిషం దౌత్యం ఫలించడంతో ట్రంప్ తన నిర్ణయాన్ని మార్చుకున్నారని, నిరసనకారులను ఉరితీయబోమని ఇరాన్ నుంచి హామీ లభించిందని ఆయన ప్రకటించినట్లు సదరు అధికారి తెలిపారు. ఇటీవల ఇరాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త నిరసనలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. వీటిని ప్రభుత్వం ఉక్కుపాదంతో అణచివేయడంతో అమెరికా తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. పలువురు ఇరాన్ అధికారులు, సంస్థలపై ఆంక్షలు కూడా విధించింది. దీనికి ప్రతిగా అమెరికా సైనిక స్థావరాలు, నౌకలపై దాడులు చేస్తామని ఇరాన్ బెదిరించడంతో గల్ఫ్ ప్రాంతంలో యుద్ధ మేఘాలు అలుముకున్నాయి. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో ఖతార్‌లోని అమెరికా సైనిక స్థావరం నుంచి కొంత సిబ్బందిని తరలించారు. సౌదీ, కువైట్‌లోని దౌత్య కార్యాలయాల్లోనూ అప్రమత్తత ప్రకటించారు. ప్రాంతంలో అనియంత్రిత పరిస్థితులు తలెత్తకుండా నివారించడమే తమ లక్ష్యమని సౌదీ అధికారి తెలిపారు. ప్రస్తుతం ఇరు పక్షాల మధ్య విశ్వాసాన్ని పెంచేందుకు చర్చలు కొనసాగుతున్నాయని, దీంతో ఉద్రిక్తతలు తాత్కాలికంగా తగ్గుముఖం పట్టాయని తెలుస్తోంది.

# గచ్చిబౌలిలో 57వ 'ఫిట్ ఇండియా- సండేస్ ఆన్ సైకిల్

**పాల్గొననున్న పుల్లెల గోపీచంద్, ఇతర ప్రముఖులు**

హైదరాబాద్, జనవరి 16 (ఈవార్తలు): శారీరక ధృడత్వం, ఏకాగ్రత, సామాజిక భాగస్వామ్యం అనే వినూత్న కలయికతో ఈ ఆదివారం జరగనున్న 57వ విడత 'ఫిట్ ఇండియా - సండేస్ ఆన్ సైకిల్‌కు ఆతిథ్యం ఇచ్చేందుకు హైదరాబాద్ నగరం సిద్ధమైంది. ఆధ్యాత్మిక, ఆరోగ్య సంరక్షణ విషయంలో ఈ కార్యక్రమానికి ఉన్న ప్రత్యేకతను తెలియజేస్తూ రంగారెడ్డి జిల్లా చేగూరు గ్రామం సమీపంలోని కన్హా శాంతి వనం ప్రాంగణంలో అంతర్జాతీయ ప్రధాన కార్యాలయం కలిగిన హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఈ కార్యక్రమంతో జతకలిసింది. డిసెంబర్ 2024లో యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ శ్రీ మన్సుఖ్ మాండవియా ప్రారంభించిన ఈ 'ఫిట్ ఇండియా - సండేస్ ఆన్ సైకిల్.. శారీరక దృఢత్వం, స్వచ్ఛమైన వాతావరణం, సుస్థిరతను ప్రోత్సహించే ఒక 'ప్రజా ఉద్యమం'గా మారింది. ఈ ఉద్యమంలో దేశవ్యాప్తంగా 2 లక్షలకు పైగా ప్రదేశాలలో 22 లక్షల కంటే ఎక్కువ మంది భాగస్వాములయ్యారు. నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్ణ కార్యక్రమంలో పదేపదే ఈ కార్యక్రమం గురించి ప్రస్తావించారు. ఈ ఉద్యమం ద్వారా భారత్.. ఆరోగ్యాన్ని దినచర్యతో, శ్రమను క్రమశిక్షణతో, వ్యక్తిగత శ్రేయస్సును దేశ శ్రేయస్సుతో సమతుల్యం చేయడం నేర్చుకుంటోందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం స్థూలకాయంపై పోరాటం, కాలుష్యానికి పరిష్కారం అనే రెండు ముఖ్యమైన అంశాలపై పనిచేస్తూ ప్రజలకు కర్బన ఉద్గారాలను తగ్గిస్తూనే ఆరోగ్యంగా ఉండటానికి ఒక సులభమైన, ఆహ్లాదకరమైన మార్గాన్ని అందిస్తుంది. 'ఫిట్ ఇండియా - సండేస్ ఆన్ సైకిల్ణ 57వ విడతలో భారత మాజీ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్‌తో పాటు పారిస్ 2024 పారాలింపిక్ కాంస్య పతక విజేత- అర్జున అవార్డు గ్రహీత (2025)- ప్రపంచ రికార్డు సాధించిన దీప్తి జీవంజి, ఇతర అథ్లెట్లు పాల్గొననున్నారు.



## 'దేశీ ఊన్'కు గోల్డ్ మెడల్

**భారత యానిమేషన్ రంగానికి అంతర్జాతీయ ఖ్యాతి**

న్యూఢిల్లీ: ప్రసిద్ధ యానిమేషన్ చిత్ర దర్శకుడు, 'క్రియేట్ ఇన్ ఇండియా' (సీఐసీ) పోటీల విజేత సురేష్ ఎరియట్ తన 'దేశీ ఊన్' (స్వదేశీ ఊలు) చిత్రంతో భారత యానియేషన్ రంగానికి అంతర్జాతీయ ఖ్యాతినార్జించి పెట్టారు. ఫ్రాన్స్‌లో నిర్వహించిన యాన్సీ అంతర్జాతీయ యానిమేషన్ చలనచిత్రోత్సవం-2025లో ఇది 'ఉత్తమ కమిషన్డ చిత్రంగా జ్యూరీ అవార్డు గెలుపొంది, భారత్ గర్వపడేలా చేసింది. 'వేవ్స్ అవార్డ్స్ ఆఫ్ ఎక్సలెన్స్-2025'లో 'సీఐసీ' కింద నిర్మించిన 'దేశీ ఊన్' చిత్రం స్వర్ణ పతకం సాధించింది. భారతీయ సంస్కృతిని ప్రపంచ స్థాయి కథనం, యానిమేషన్‌ల అద్భుత సమ్మేళనంగా మలచిన చిత్రమిది. గ్రామీణ భారతం నేపథ్యంగా రూపొందించిన ఈ చిత్రం, గొర్రెల కాపరుల జీవితాల్లోని భావోద్వేగపు లోతులను సాధికారికంగా ప్రేక్షకుల కళ్లకు కట్టింది. ఆ మేరకు సంప్రదాయం, పట్టుదల, గుర్తింపు సంబంధిత శక్తిమంతమైన కథనాన్ని అల్లింది. 'యాన్సీలో ఈ గుర్తింపు నాకు దక్కిన గొప్ప గౌరవం. ఇది నిస్సందేహంగా ఓ భారతీయ చిత్రం సాధించిన అరుదైన విజయం. ఈ చలనచిత్రోత్సవ పురస్కారాన్ని భారత్ కైవసం చేసుకోవడం మాకెంతో సంతోషాన్నిస్తోంది. 'వేవ్స్'లో స్వర్ణ పతకం సాధించిన చిత్రాల్లో 'దేశీ ఊన్' కూడా ఒకటి. 'క్రియేట్ ఇన్ ఇండియా ఛాలెంజ్ణకి నిజంగా ఇదెంతో స్ఫూర్తినిచ్చింది" అని సురేష్ ఎరియట్ పేర్కొన్నారు.



## 99టీవీ క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల టౌన్, జనవరి 16 (ఈవార్తలు): జగిత్యాల ఎమ్మెల్యే పార్టీ కార్యాలయంలో 2026 నూతన సంవత్సర 99 టీవీ క్యాలెండర్‌ను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ.. ప్రజల గొంతుకగా నిలుస్తున్న 99టీవీ ద్వారా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. 99టీవీ వార్తల సేకరణలో నిజాయతీగా ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య బలమైన అనుసంధాన కర్తగా పనిచేస్తుందని ప్రశంసించారు. 99 టీవీ యాజమాన్యానికి, సిబ్బందికి, జగిత్యాల నియోజకవర్గం ప్రజలకు, పార్టీ శ్రేణులకు నూతన సంవత్సర, సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. 99 టీవీ ఇంకా ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 99 టీవీ రిపోర్టర్ మోసిక్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



## హైదరాబాద్‌కు క్యూ

**సంక్రాంతి తిరుగు ప్రయాణాలు.. ఏపీలో ప్రధాన బస్టాండ్లలో రద్దీ**

విజయవాడ, జనవరి 16 (ఈవార్తలు): మూడు రోజుల పాటు అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు శుక్రవారం కనుమ పండుగతో ఘనంగా ముగిశాయి. పండుగ కోసం సొంతూళ్లకు వచ్చిన ప్రజలు తిరిగి నగరాలకు పయనమవుతుండడంతో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. భోగి మంటలతో ప్రారంభమైన వేడుకల కోసం ఉద్యోగ, వ్యాపార, విద్యా అవసరాల రీత్యా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో స్థిరపడిన వారంతా పల్లెలకు, పట్నాలకు చేరుకున్నారు. బంధుమిత్రుల రాకతో ఇన్నాళ్లూ కళకళలాడిన పల్లెలు ఈ సాయంత్రం నుంచి క్రమంగా ఖాళీ అవుతున్నాయి. పండుగ సెలవులు ముగియడంతో అందరూ తిరుగు ప్రయాణాలు కట్టారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా రవాణా వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. ప్రధాన నగరాలకు వెళ్లే ఆర్టీసీ బస్సుల్లో సీట్లన్నీ ముందుగానే రిజర్వ్ అయిపోయాయి. రైళ్లలోనూ సాధారణ బోగీల నుంచి రిజర్వేషన్ బోగీల వరకు ఎక్కడా ఖాళీ కనిపించడం లేదు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఏపీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. రద్దీని తగ్గించేందుకు దక్షిణ మధ్య రైల్వే కూడా పలు ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తెచ్చింది. ఈ రద్దీ సోమవారం వరకు కొనసాగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.



# వందేమాతరం దీక్షతో దేశభక్తి పెంపొందించాలి

**ప్రముఖ సామాజిక కార్యకర్త, పర్వతారోహకురాలు రేఖారావు**



నల్లకుంట/హైదరాబాద్, జనవరి 16 (ఈవార్తలు): వందేమాతరం దీక్ష భారతదేశంలోని ప్రతీ ఒక్కరిలో దేశభక్తిని పెంపొందించే విధంగా స్ఫూర్తి నింపుతోందని ప్రముఖ సామాజిక కార్యకర్త, పర్వతారోహకురాలు రేఖారావు స్పష్టం చేశారు. ఈక్రమంలో హైదరాబాద్‌లోని నల్లకుంట్ల వందే ప్రజ,నిత్యజనగణమన ప్రాంగణంలో గురువారం నిర్వహించిన వందేమాతర దీక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రేఖారావు మాట్లాడుతూ నిత్యజనగణ పేరిట 1349 రోజుల పాటు ప్రతీరోజూ జెండా అవిష్కరణ గావించడం, ఇదే వేదికలో వందేమాతరం దీక్ష చేపట్టడం దేశ వ్యాప్తంగా తొలిసారి అని అన్నారు. వందేమాతరం దీక్ష ధరించిన దేశభక్తులను, నిత్యజనగణమన వేదిక నిర్వాహకులను పేరుపేరునా ప్రశంసించారు. భావిభారత పౌరులలో దేశభక్తిని పెంపొందిం చేందుకు సరికొత్తగా 11 రోజుల పాటు దీక్ష ఆచరిస్తూ ముందుకు సాగడం అద్భుతమన్నారు. దేశభక్తికి సంబందించిన కార్యక్రమాలంటే తనకు ఎంతో ఇష్టమని, ఈ తరహా కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. దేశం కోసం, దేశ భక్తి కోసం నిత్యజనగణమన ఫౌండర్ నేలంటి మధు, వందేమాతరం దీక్ష వ్యవస్థాపకులు చెన్నూరు నాగ శ్రీధర్‌శర్మ, నిర్వహకులు మరిన్ని కార్యాక్రమాలు



చేపట్టాలని ఆకాంక్షించారు. తొలుత నల్లకుంట్లలో ప్రారంభమైన నిత్యజనగణమన, వందేమాతరం దీక్ష భవిష్యత్తులో అనేక ప్రాంతాలలో విస్తరించాలన్నారు. అనంతరం నిత్యజనగణమన వేదిక వ్యవస్థాపకులు నేలంటి మధు, వందేమాతరం దీక్ష ఫౌండర్ చెన్నూరు నాగ శ్రీధర్‌శర్మల మాట్లాడుతూ.. ప్రతీ పౌరుడిలో దేశ భక్తి పెంచేలా 1349 రోజుల పాటు జెండావిష్కరణ గావిస్తున్నామని, పౌరుల కోరిక మేరకు ఎన్ని ఆటంకాలు వచ్చినా నిరంతరాయంగా జెండా విష్కరణ, దీక్షలు కొనసాగిస్తామని చెప్పారు. ఈక్రమంలో వందేమాతరం దీక్ష ధరించిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. వందేమాతరం దీక్ష ప్రారంభమైన రోజే ఆర్మీ డే కావడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో నిత్య జనగణమన నిర్వాహకులు ఎం కే శ్రీనివాస్, ఉపేందర్ ప్రసాద్ దూబే, డీ ఎన్ రావు, దుబాసి ప్రతిభ, జర్నలిస్ట్ జమ్మికుంట శ్రీనివాస్, హైకోర్టు న్యాయవాది, సామాజిక కార్యకర్త భాగ్యరేఖ, వెంకటరాము, దేవేందర్‌రెడ్డి, నవీన్,అనిల్‌కుమార్‌లు దీక్ష ధరించి వందేమాతరం అంటూ ర్యాలీ నిర్వహించారు.

## రెండు కుటుంబాల మధ్యే తేల్చుకుందాం

**జేసీ సవాల్‌కు సై అన్న కేతిరెడ్డి పెద్దారెడ్డి**

తాడిపత్రి, జనవరి 16 (ఈవార్తలు): ఏపీలోని అనంతపురం జిల్లా తాడిపత్రిలో రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత కేతిరెడ్డి పెద్దారెడ్డి... టీడీపీ నేత, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి విసిరిన సవాల్‌ను స్వీకరించారు. రాయలసీమ పౌరుషంపై బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని ఆయన స్పష్టం చేశారు. దీంతో తాడిపత్రి నియోజకవర్గంలో రాజకీయ ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, "తాడిపత్రిలో జేసీ కుటుంబం 30 ఏళ్ల పాలన, నా 5 ఏళ్ల పాలనపై బహిరంగంగా చర్చించేందుకు నేను సిద్ధం. తేదీ, సమయం ఖరారు చేసి, జిల్లా కలెక్టర్, ఎస్పీకి సమాచారం ఇవ్వండి. రాయలసీమలో ఎక్కడైనా ఈ చర్చకు నేను వస్తాను" అని కేతిరెడ్డి ప్రకటించారు. ఈ చర్చకు కేవలం కుటుంబ సభ్యులు మాత్రమే హాజరుకావాలని, ఇరు కుటుంబాల మధ్యే తేల్చుకుందామని ఆయన షరతు విధించారు. జేసీ ప్రభాకర్ రెడ్డి పోలీసులను అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారని కేతిరెడ్డి ఆరోపించారు. తాను ఆయనకు భయపడనని అన్నారు. గతంలో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై తాను చేసిన వ్యాఖ్యలను జేసీ విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. తాడిపత్రిలో టీడీపీ నేతల అక్రమాలపై రెండుసార్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా, జేసీ అడ్డుపడటంతో విచారణ జరగడం లేదని విమర్శించారు. తనను నియోజకవర్గంలో స్వేచ్ఛగా తిరగనివ్వడం లేదని కూడా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# హోమ్ మేడ్ పచ్చళ్ల పేరుతో మోసం

**కంపెనీల పికిల్స్ తెచ్చి ఇంట్లో తయారైనవిగా ప్రచారం... జగిత్యాలలోని ఓ స్వీట్ షాపులో బయటపడ్డ మోసం**

జగిత్యాల టౌన్, జనవరి 16 (ఈవార్తలు): హోమ్ మేడ్ పికిల్స్ అనగానే నమ్మేసి కొంటున్నారా? అయితే ఒక్క క్షణం ఆగండి. బయట ఎక్కడో తయారుచేసిన పచ్చళ్లను తీసుకొచ్చి, ఇంట్లో తయారుచేసినవేనని నమ్మిస్తూ మోసానికి పాల్పడుతున్న ఉదంతాలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా, అలాంటి ఘటనే జగిత్యాల జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే.. పట్టణానికి చెందిన నవీన్ కొత్త బస్టాండ్ వద్ద ఉన్న రాజు స్వీట్స్‌కి వెళ్లి, ఇంట్లో తయారు చేసిన పికిల్స్ అని నమ్మి ఒక కిలో రూ.180కి దొరికేదాన్ని రూ.400కు కొనుగోలు చేశాడు. అయితే ఇంటికి చేరుకుని బాక్స్ తెరిచి చూసిన నవీన్ షాక్‌కు గురయ్యాడు. హోమ్ మేడ్ అని చూపించిన పికిల్స్ డబ్బాపై ఓ కంపెనీకి చెందిన సీల్ మార్క్ వుండటం గమనించాడు. బయట స్టిక్కర్‌ను తీసేసినప్పటికీ, లోపల ఉన్న సీల్‌పై ముద్రను తీసేయడం మాత్రం షాప్ యజమాని మర్చిపోవడంతో



నిజం బయటపడింది. స్వీట్స్ షాపు యజమాని తనను మోసం చేశాడని గ్రహించాడు. ఈ మోసంపై బాధితుడు అధికారులకు ఫిర్యాదుచేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తనలా మరెవ్వరూ మోసపోకూడదని, తక్కువ ధరకు దొరికే వాటిని తీసుకొచ్చి ఎక్కువ రేటుకు అమ్ముతున్న మోసకారి వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని నవీన్ డిమాండ్ చేస్తున్నాడు.

# జగన్ మళ్లీ పాదయాత్ర

**2029కి వైసీపీ రోడ్‌మ్యాప్**

**2027 ప్లీనరీ తర్వాత రాష్ట్రవ్యాప్త పాదయాత్ర**

**మాజీమంత్రి పేర్ని నాని వెల్లడి**

విజయవాడ, జనవరి 16 (ఈవార్తలు): వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పేర్ని నాని ఓ యూట్యూబ్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 2029 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా తమ పార్టీ అధినేత జగన్ అనుసరించబోయే వ్యూహాన్ని వెల్లడించారు. 2027లో పార్టీ ప్లీనరీ సమావేశం ముగిసిన వెంటనే జగన్ రాష్ట్రవ్యాప్తంగా భారీ పాదయాత్ర చేపడతారని ఆయన స్పష్టం చేశారు. 2029 ఎన్నికలు ఒక 'టగ్ ఆఫ్ వార్ణ (బలప్రదర్శన) లాంటివని, దానికి సిద్ధమయ్యేందుకే ఈ పాదయాత్ర అని ఆయన వివరించారు. 2019 ఎన్నికలకు ముందు జగన్ చేపట్టిన పాదయాత్ర, 'నవరత్నాలు' అనే శక్తివంతమైన మేనిఫెస్టో రూపకల్పనకు ఎలా దోహదపడిందో గుర్తుచేస్తూ, రాబోయే పాదయాత్ర ఉద్దేశాన్ని పేర్ని నాని వివరించారు. కూటమి ప్రభుత్వ పాలనలో సమాజంలో వచ్చిన మార్పులు, ప్రజలు ఎదుర్కొంటున్న కొత్త సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకే జగన్ మళ్లీ ప్రజల్లోకి వెళ్తున్నారని తెలిపారు. కాలంతో పాటు ప్రజల సమస్యలు మారుతుంటాయని, వాటిని నేరుగా చూసి అర్థం చేసుకున్నప్పుడే ఒక నాయకుడు సరైన పరిష్కారాలు చూపగలడని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ యాత్ర ద్వారా ప్రజల "హృదయాలను, హృదయ స్పందనను" తాకడమే జగన్ లక్ష్యమని పేర్కొన్నారు. భవిష్యత్ ప్రణాళికలను వివరిస్తూనే, 2024 ఎన్నికల ఓటమికి దారితీసిన పాలనాపరమైన లోపాలను పేర్ని నాని నిక్కచ్చిగా అంగీకరించారు. ముఖ్యంగా, ఎమ్మెల్యేల పనితీరుకు మద్దతు ఇచ్చేలా ముఖ్యమంత్రి కార్యాలయాన్ని (సీఎంఓ) జగన్ నిర్వహించడంలో పర్యవేక్షణాపరమైన వైఫల్యం ఉందని ఆయన ఒప్పుకున్నారు. ఒక ప్రభుత్వం విజయవంతం కావాలంటే, నాయకుడి చుట్టూ ఉన్న సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రజాప్రతినిధుల పనులకు అడ్డుపడకుండా, వారికి సహకరించాలని అన్నారు. గతంలో జరిగిన ఈ పాలనాపరమైన పొరపాట్లను సరిదిద్దుకోవడం, 2029లో తిరిగి అధికారంలోకి రావడానికి తమ పార్టీ విశ్వసనీయతకు చాలా కీలకమని భావిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత అధికార కూటమి చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టడం కూడా 2029 రోడ్‌మ్యాప్‌లో ఒక ముఖ్యమైన భాగంగా పేర్కొన్నారు. తమ ప్రభుత్వం సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థ ద్వారా సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించడంపైనే దృష్టి పెట్టిందని, ఈ సమయంలో వైసీపీ సోషల్ మీడియా విభాగం కొంత నిష్క్రియాత్మకంగా మారిందని నాని అంగీకరించారు. ఇదే అదునుగా ప్రత్యర్థి మీడియా వర్గాలు తమపై విష ప్రచారం చేశాయని, అది కూడా ఓటమికి ఒక కారణమని విశ్లేషించారు. అందుకే ఇప్పుడు కూలీల నుంచి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల వరకు పార్టీ మద్దతుదారులందరినీ తిరిగి యాక్టివేట్ చేసి, డిజిటల్ వేదికలపై ప్రభుత్వ వాదనలను దూకుడుగా ఎదుర్కొనేందుకు సిద్ధమవుతున్నట్లు చెప్పారు.







# పాలనకు అర్హతెక్కడ?

**చంద్రబాబుపై జగన్ ఫైర్**

తాడేపల్లి, జనవరి 16 (ఈవార్తలు): ఏపీలోని గురజాల నియోజకవర్గానికి చెందిన వైసీపీ కార్యకర్త సాల్మన్ హత్యపై వైసీపీ అధినేత జగన్ తీవ్రంగా స్పందించారు. రాజకీయ కక్షలతో ఇలాంటి అరాచకాలు జరుగుతున్నాయంటూ చంద్రబాబును ఉద్దేశించి ఎక్స్ వేదికగా ఆయన ప్రశ్నలు సంధించారు. "చంద్రబాబు... మీరు పాలించడానికి అర్హులేనా? రాజకీయ కక్షలతో ఎంతమంది ప్రాణాలను బలి తీసుకుంటారు? ముఖ్యమంత్రి పదవిలో ఉండి కూడా రెడ్‌బుక్ రాజ్యాంగం, రాజకీయ పాలన ముసుగులో ఇన్ని అరాచకాలకు పాల్పడతారా?" అంటూ జగన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురజాల నియోజకవర్గం పిన్నెల్లి గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త, దళిత యువకుడు మందా సాల్మన్ హత్యపై మీరు ఏం సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు. అనారోగ్యంతో ఉన్న భార్యను చూడటానికి సొంత గ్రామానికి వచ్చిన సాల్మన్‌ను ఇనుప రాడ్లతో కొట్టి హత్య చేయడం అమానుషమని అన్నారు. ఈ ఘటన పూర్తిగా వైసీపీ కార్యకర్తలను భయపెట్టేందుకు అధికార పార్టీ నేతలు, కొంతమంది పోలీసులు కలిసి చేస్తున్న కుట్రేనని జగన్ ఆరోపించారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా, తమకు నచ్చని వారిని బెదిరించడం, హత్యా రాజకీయాలకు పాల్పడటం వల్లే పిన్నెల్లి గ్రామం నుంచి వందలాది వైసీపీ కార్యకర్తల కుటుంబాలు ప్రాణభయంతో ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయాయని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన నాటి నుంచి పల్నాడు జిల్లా సహా రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి ఘటనలు కొనసాగుతూనే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఇంత జరుగుతున్నా సిగ్గు లేకుండా ఈ ప్రభుత్వం హింసను ప్రోత్సహిస్తోందని జగన్ విమర్శించారు. పౌరులకు రక్షణ కల్పించడం, వారు స్వేచ్ఛగా జీవించేలా చూడటం ప్రభుత్వ బాధ్యత కాదా? అని ప్రశ్నించారు. ఆ బాధ్యతను నిర్వర్తించడంలో విఫలమవడం మాత్రమే కాకుండా, కక్షల కోసం శాంతిభద్రతలను దెబ్బతీస్తూ హత్యా రాజకీయాలకు వెన్నుదన్నుగా నిలవడం ఘోరమైన నేరమని అన్నారు. ఇది స్పష్టమైన రాజ్యాంగ ఉల్లంఘన అని పేర్కొంటూ, హింసా రాజకీయాలకు పాల్పడుతున్న వారిని ప్రజలు ఎప్పటికీ క్షమించరని, తప్పకుండా మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు.



# స్టార్టప్ ఇండియాకు పదేళ్లు

## దేశ యువతపై ప్రధాని మోదీ ప్రశంసలు.. పదేళ్లలో 2 లక్షలకు పైగా చేరిన స్టార్టప్‌లు

న్యూఢిల్లీ: భారత యువత ఆవిష్కరణలు, నూతన ఆలోచనలతో నిజమైన సమస్యలను పరిష్కరించే మార్గంలో పయనిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ప్రధాని ప్రారంభించిన స్టార్టప్ ఇండియా మిషన్ పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం నాడు ఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ పదేళ్ల ప్రయాణం కేవలం ప్రభుత్వ కార్యక్రమ విజయం మాత్రమే కాదని, లక్షలాది యువత కలలు సాకారమైన ప్రయాణమని ఆయన అభివర్ణించారు. పదేళ్ల క్రితం దేశంలో 500 కంటే తక్కువ స్టార్టప్‌లు ఉండేవని, ఇప్పుడు ఆ సంఖ్య 2 లక్షలకు పైగా చేరిందని ప్రధాని గుర్తుచేశారు. అప్పట్లో కేవలం నాలుగు యూనికార్న్‌లు (ఒక బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ విలువైన స్టార్టప్) ఉంటే, ఇప్పుడు 125కు పైగా క్రియాశీల యూనికార్న్‌లు ఉన్నాయని, ఈ అద్భుతమైన వృద్ధి ప్రపంచ దృష్టిని ఆకర్షించిందని వివరించారు. ఈ ప్రగతితో భారత్, ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా అవతరించిందని తెలిపారు. ఈ స్టార్టప్‌లు డీప్ టెక్, స్పేస్ టెక్, డ్రోన్ టెక్, క్వాంటం టెక్, అగ్రిటెక్, ఏఐ/ఎంఎల్ వంటి 50కి పైగా రంగాల్లో పనిచేస్తూ దేశ ఆర్థిక వ్యవస్థకు బలాన్నిస్తున్నాయని ప్రధాని అన్నారు. వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ కథనం ప్రకారం, ఈ స్టార్టప్‌లు దేశవ్యాప్తంగా 21 లక్షలకు పైగా ఉద్యోగ అవకాశాలను సృష్టించాయి. స్టార్టప్ ఇండియా మిషన్‌లో మహిళలు ప్రధాన పాత్ర పోషిస్తున్నారని మోదీ అన్నారు. గుర్తింపు పొందిన స్టార్టప్‌లలో దాదాపు 45 శాతం వాటిలో కనీసం ఒక మహిళా డైరెక్టర్ లేదా భాగస్వామి ఉన్నారని తెలిపారు. అంతేకాకుండా, సుమారు సగం స్టార్టప్‌లు నాన్-మెట్రో నగరాల్లోనే ఉండటం, ఆవిష్కరణల కేంద్రాలుగా టైర్-2, 3 నగరాలు ఎదుగుతున్నాయనడానికి నిదర్శనమన్నారు. ఒకప్పుడు స్టార్టప్‌లను వైఫల్యానికి దారితీసే మార్గంగా, కేవలం సంపన్నుల పిల్లలకే పరిమితమైనవిగా చూసేవారని, కానీ స్టార్టప్ ఇండియా కార్యక్రమం ఈ దృక్పథాన్ని పూర్తిగా మార్చేసిందని తెలిపారు. "నా ముందు




కొత్తగా ఆవిర్భవిస్తున్న భారత్ భవిష్యత్తు కనిపిస్తోంది" అని స్టార్టప్ వ్యవస్థాపకులను ఉద్దేశించి మోదీ అన్నారు. "మీ కలలే ఈ దేశ ప్రగతికి చోదక శక్తి" అని కొనియాడారు. డిజిటల్ స్టార్టప్‌లు, సేవా రంగంలో మనం అద్భుతమైన విజయం సాధించామని, ఇప్పుడు తయారీ రంగంపై కూడా మన స్టార్టప్‌లు మరింత దృష్టి పెట్టాల్సిన సమయం ఆసన్నమైందని ప్రధాని పిలుపునిచ్చారు. "ప్రపంచంలోనే అత్యుత్తమ నాణ్యతతో కొత్త ఉత్పత్తులను తయారు చేయాలి. సాంకేతికతలోనూ మనం ప్రత్యేకమైన ఆలోచనలతో ముందంజ వేయాలి. మీ ప్రతి ప్రయత్నంలో ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని నేను హామీ ఇస్తున్నాను" అని మోదీ భరోసా ఇచ్చారు. ఈ వృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న మద్దతును గుర్తుచేస్తూ, ఫండ్ ఆఫ్ ఫండ్స్ ఫర్ స్టార్టప్స్, క్రెడిట్ గ్యారెంటీ స్కీమ్ ఫర్ స్టార్టప్స్, స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ స్కీమ్ వంటి పథకాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. జాతీయ స్టార్టప్‌ల దినోత్సవం మన ప్రజల ధైర్యం, ఆవిష్కరణల స్ఫూర్తి, వ్యవస్థాపక ఉత్సాహానికి ప్రతీక అని ప్రధాని తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. వికసిత భారత్ 2047 లక్ష్య సాధనలో స్టార్టప్‌ల పాత్ర కీలకమని స్పష్టం చేశారు.



## ఇరాన్ చెరలో 16 మంది భారత నావికులు

**కేంద్ర ప్రభుత్వానికి కుటుంబ సభ్యుల విజ్ఞప్తి**

న్యూఢిల్లీ: ఇరాన్‌లో చిక్కుకుపోయిన తమ వారిని సురక్షితంగా వెనక్కి తీసుకురావాలని భారత నావికుల కుటుంబాలు కేంద్ర ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాయి. గత నెలలో భారత్‌కు చెందిన 16 మంది నావికులు ఇరాన్‌లో చిక్కుకుపోగా, అక్కడి భద్రతా సిబ్బంది వారిని అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. దీంతో నావికుల కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. ఇరాన్‌లో ప్రస్తుతం పరిస్థితులు హింసాత్మకంగా మారిన నేపథ్యంలో, తమ వారిని సాధ్యమైనంత త్వరగా వెనక్కి తీసుకురావాలని వారు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఇరాన్ ప్రభుత్వంతో చర్చలు జరిపి, తమ వారిని సురక్షితంగా భారత్‌కు తీసుకు రావాలని నౌక కెప్టెన్ ఖేతన్ మెహతా అనే ఇంజినీర్ తల్లిదండ్రులు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నెల రోజులకు పైగా ఇరాన్ చెరలో ఉన్న తమ వారికి సరైన వైద్య, న్యాయ, ఆర్థిక సహాయం అందించేలా చూడాలని వారు కోరారు. మరోవైపు, నావికుల కుటుంబ సభ్యులు దీనికి సంబంధించి ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన న్యాయస్థానం స్టేటస్ రిపోర్టును అందజేయాలని కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది. వివిధ కారణాల వల్ల 16 మంది నావికులతో కూడిన భారతీయ నౌకను ఇరాన్ నావికులు స్వాధీనం చేసుకున్నారు. యూఏఈలోని దిబ్బా పోర్టు సమీపంలో అంతర్జాతీయ జలాల్లో వెళుతున్న వాలియంట్ రోర్ అనే నౌకను ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ గత సంవత్సరం డిసెంబర్ 8న వెంబడించారు. ఆ నౌకలో 6 వేల మెట్రిక్ టన్నుల ఇంధనం స్మగ్లింగ్ జరుగుతోందని ఆరోపిస్తూ సిబ్బందిని నిర్బంధించారు. ఆ సమయంలో నౌకలో 18 మంది నావికులు ఉండగా, అందులో 16 మంది భారతీయులు ఉన్నారు. వీరిలో పదిమందిని జైలుకు తీసుకువెళ్లగా, మిగతా వారు ఇరాన్ గార్డుల నిఘూలో నౌకలోనే ఉన్నట్లు సమాచారం. ఈ నావికులందరూ ఏ దేశంలోని నౌకల్లో అయినా పని చేసే లైసెన్స్ కలిగిన వారు కావడం గమనార్హం.

# గ్రీన్‌లాండ్‌పై ట్రంప్‌నకు మద్దతు కరువు

**రాయిటర్స్ సర్వేలో కీలక విషయాలు వెల్లడి**

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రతిపాదనకు సొంత దేశంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. డెన్మార్క్ పరిధిలోని స్వయంప్రతిపత్తి గల ప్రాంతమైన గ్రీన్‌లాండ్‌ను అమెరికాలో విలీనం చేసుకోవాలన్న ఆయన ఆలోచనను మెజారిటీ ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. ప్రతి ఐదుగురు అమెరికన్లలో కేవలం ఒకరు మాత్రమే ఈ ప్రతిపాదనకు మద్దతు ఇస్తున్నట్టు ప్రముఖ వార్తా సంస్థ రాయిటర్స్, ఇప్సోస్ సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో తేలింది. జనవరి 12, 13 తేదీల్లో 1,217 మంది అమెరికన్ వయోజనులపై ఆన్‌లైన్‌లో ఈ సర్వే నిర్వహించారు. సర్వే ఫలితాల ప్రకారం, గ్రీన్‌లాండ్‌ను కొనుగోలు చేసే ప్రయత్నాలకు కేవలం 17 శాతం మంది మాత్రమే మద్దతు పలికారు. 47 శాతం మంది దీనిని వ్యతిరేకించగా, మరో 35 శాతం మంది దీనిపై ఏ అభిప్రాయం చెప్పలేకపోయారు. "జాతీయ భద్రత దృష్ట్యా గ్రీన్‌లాండ్ అమెరికాకు అత్యవసరం" అని ట్రంప్ ఇటీవల తన ట్రూత్ సోషల్ ఖాతాలో పేర్కొన్న నేపథ్యంలో ఈ సర్వేకు ప్రాధాన్యం ఏర్పడింది. గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవడానికి సైనిక చర్యను ఉపయోగించడంపై కూడా ప్రజల అభిప్రాయాన్ని కోరగా, అత్యధికులు దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. దాదాపు 71 శాతం మంది ఇది "చెడ్డ ఆలోచన" అని అభిప్రాయపడగా, కేవలం 4 శాతం మంది మాత్రమే సైనిక చర్యకు మద్దతు తెలిపారు. ఈ విషయంలో పార్టీల పరంగా చూస్తే, రిపబ్లికన్లలో 40 శాతం మంది కొనుగోలుకు మద్దతివ్వగా, డెమోక్రాట్లలో 79 శాతం మంది తీవ్రంగా వ్యతిరేకించారు. అయితే, ఈ సర్వే ఫలితాలపై వైట్‌హౌస్ స్పందించింది. డిప్యూటీ ప్రెస్ సెక్రటరీ అన్నా కెల్లీ మాట్లాడుతూ, "అధ్యక్షుడు ట్రంప్ ఒక దార్శనిక నాయకుడు. జాతీయ భద్రతను బలోపేతం చేయడానికి ఆయన ఎప్పుడూ సృజనాత్మక ఆలోచనలు చేస్తారు. గ్రీన్‌లాండ్‌ను సొంతం చేసుకోవాలనే ఆలోచనను గతంలో చాలా మంది అధ్యక్షులు గుర్తించినా, దానిని తీవ్రంగా ముందుకు తీసుకెళ్లే ధైర్యం ఒక్క ట్రంప్‌కు మాత్రమే ఉంది" అని వ్యాఖ్యానించారు. మరోవైపు, ఈ కొనుగోలు ప్రయత్నాలు నాటో కూటమితో అమెరికా సంబంధాలను దెబ్బతీస్తాయని 66 శాతం మంది అమెరికన్లు ఆందోళన వ్యక్తం చేసినట్లు కూడా సర్వేలో తేలింది. మొత్తం మీద, జాతీయ భద్రత పేరుతో గ్రీన్‌లాండ్‌ను సొంతం చేసుకోవాలని ట్రంప్ భావిస్తుండగా, అందుకు ప్రజా మద్దతు ఏమాత్రం లేదని ఈ సర్వే స్పష్టం చేస్తోంది.



## ట్రంప్‌నకు శాంతి నోబెల్

**పతకాన్ని అందించిన వెనెజువెలా నేత మచాడో**

వాషింగ్టన్: వెనెజువెలా విపక్ష నేత, 2025 నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మారియా కొరీనా మచాడో అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు తన నోబెల్ బహుమతి పతకాన్ని బహూకరించారు. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను పదవి నుంచి తొలగించడంలో ట్రంప్ చూపిన చొరవకు కృతజ్ఞతగా ఈ బహుమతిని సమర్పించినట్లు ఆమె వెల్లడించారు. గురువారం వాషింగ్టన్‌లోని వైట్‌హౌస్‌లో డొనాల్డ్ ట్రంప్‌తో మారియా మచాడో సమావేశమయ్యారు. సుమారు రెండున్నర గంటల పాటు సాగిన ఈ భేటీ అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. "మా స్వేచ్ఛ కోసం ట్రంప్ చూపిన అసమాన నిబద్ధతకు గుర్తింపుగా ఈ నోబెల్ పతకాన్ని ఆయనకు అందించాను" అని ప్రకటించారు. ఈ పతకాన్ని అధ్యక్షుడు తన వద్దే ఉంచుకోవాలని భావిస్తున్నట్టు వైట్ హౌస్ అధికారి ఒకరు వెల్లడించారు. ఈ పరిణామంపై నార్వేజియన్ నోబెల్ ఇనిస్టిట్యూట్ స్పందిస్తూ, నోబెల్ గ్రహీత హోదాను బదిలీ చేయడం కానీ, దానిని ఇతరులతో పంచుకోవడం లేదా రద్దు చేయడం కానీ సాధ్యం కాదని స్పష్టం చేసింది. కాగా, "ఈ బహుమతి వెనెజువెలా ప్రజలది. దీనిని ట్రంప్‌తో పంచుకోవాలని మేము కోరుకుంటున్నాం" అని మచాడో గతంలోనే వ్యాఖ్యానించారు.

# అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు

**ఇజ్రాయెల్‌లో భారతీయులకు హై అలర్ట్**

టెహ్రాన్: పశ్చిమాసియాలో ముప్పు ముంచుకొస్తున్న వేళ భారత్ తన పౌరుల భద్రతపై కీలక నిర్ణయం తీసుకుంది. ఇరాన్, అమెరికా మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు ఇజ్రాయెల్‌పై ప్రభావం చూపవచ్చనే నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో అక్కడ నివసిస్తున్న భారత పౌరులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఇజ్రాయెల్ లోని భారత ఎంబసీ తాజా అడ్వైజరీ జారీ చేసింది. ముఖ్యంగా ఇజ్రాయెల్ అంతర్గత భద్రతా విభాగం సూచించే భద్రతా నియమాలను తు.చ తప్పకుండా పాటించాలని స్పష్టం చేసింది. ఇజ్రాయెల్‌లో ప్రస్తుతం సుమారు 40 వేల మందికి పైగా భారతీయులు ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది ఐటీ నిపుణులు, నర్సింగ్ సిబ్బంది, విద్యార్థులు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇజ్రాయెల్‌కు వెళ్లాలనుకునే వారు తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని, అక్కడ ఉన్నవారు అనవసరంగా బయట తిరగవద్దని ఎంబసీ కోరింది. అమెరికా, బ్రిటన్ దేశాలు కూడా ఇప్పటికే తమ పౌరులకు ఇవే తరహా హెచ్చరికలు జారీ చేయడం గమనార్హం. మరోవైపు, ఇరాన్‌లో అంతర్గత అల్లర్లు, అమెరికా సైనిక చర్య ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో అక్కడ ఉన్న 10 వేల మంది భారతీయులను సురక్షితంగా తరలించేందుకు భారత్ సిద్ధమైంది. ఇప్పటికే టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం విద్యార్థులు, పర్యాటకులు తక్షణమే వాణిజ్య విమానాల ద్వారా దేశం విడిచి రావాలని సూచించింది. ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తితే సంప్రదించడానికి 0972-54-7520711 వంటి ప్రత్యేక ఫోన్ నంబర్లను కూడా అందుబాటులో ఉంచింది. ఇజ్రాయెల్‌లో ఉన్న భారతీయులు ఎంబసీ వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని, భారత రాయబార కార్యాలయంతో నిరంతరం టచ్‌లో ఉండాలని అధికారులు సూచించారు.



## కాన్సాస్ సెనేట్‌లో కేఏ పాల్ ప్రసంగం

**ప్రపంచ శాంతి కోసం ప్రార్థనలు**

న్యూయార్క్: ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాలన్నీ వెంటనే ఆగిపోవాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 58 ప్రధాన యుద్ధాలు జరుగుతున్నాయని, వీటి వల్ల లక్షలాది మంది ప్రాణాలు కోల్పోతుండగా, ట్రిలియన్ల డాలర్లు వృథా అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికాలోని కాన్సాస్ స్టేట్ సెనేట్ (అసెంబ్లీ)లో ప్రసంగిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. యుద్ధాలను శాశ్వతంగా నిర్మూలించడంతోనే శాంతి సాధ్యమవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా ప్రపంచ శాంతి కోసం ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భారత్, అమెరికా మధ్య సంబంధాలు మరింత బలోపేతం కావాలని పాల్ అన్నారు. ప్రపంచ శాంతి కోసం ఇరు దేశాలు కలిసి నాయకత్వం వహించాలని చెప్పారు. మానవ హక్కులు, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడంలో భారత్, అమెరికాలు కీలక పాత్ర పోషంచగలవని అన్నారు.

## గౌరీ లంకేశ్ హత్య కేసు నిందితుడి గెలుపు

జాల్నా (మహారాష్ట్ర): మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల ఫలితాలు పలు ఆసక్తికర పరిణామాలకు దారితీశాయి. గౌరీ లంకేశ్ హత్య కేసులో నిందితుడిగా ఉన్న శ్రీకాంత్ పాంగార్కర్, జాల్నా కార్పొరేషన్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. జర్నలిస్టు గౌరీ లంకేశ్‌ను 2017లో బెంగళూరులోని ఆమె నివాసంలో గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి చంపారు. ఈ కేసులో శ్రీకాంత్‌ను అరెస్టు చేయగా, 2024లో బెయిల్‌పై విడుదలయ్యారు. జాల్నాలోని 13వ వార్డు నుంచి శ్రీకాంత్ పోటీ చేశారు. ఈ వార్డు నుంచి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన పార్టీ మాత్రమే తమ అభ్యర్థిని నిలపలేదు. బీజేపీతో సహా ఇతర ప్రధాన పార్టీలన్నీ తమ అభ్యర్థులను బరిలో నిలిపాయి. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికలకు ముందు శ్రీకాంత్, శివసేన (షిండే) పార్టీలో చేరడానికి ప్రయత్నించగా, పలు అభ్యంతరాలు రావడంతో ఏక్‌నాథ్ షిండే ఆయనను పార్టీలోకి తీసుకోలేదు. 2001-2006 మధ్య జాల్నా మున్సిపల్ కౌన్సిల్ సభ్యుడిగా పనిచేసిన శ్రీకాంత్ పాంగార్కర్‌కు 2011లో శివసేన టిక్కెట్ నిరాకరించింది. దీంతో ఆయన హిందూ జనజాగృతి సమితిలో చేరారు.

## డ్యూటీ ఎక్కనన్న పైలట్

**ఇండిగోపై ప్రయాణికుల ఫైర్**

ముంబై: ముంబై నుంచి థాయ్‌లాండ్‌లోని క్రాబీకి వెళ్లాల్సిన ఇండిగో విమానంలో గురువారం తీవ్ర గందరగోళం నెలకొంది. తన డ్యూటీ సమయం ముగిసిపోవడంతో విమానాన్ని నడిపేందుకు పైలట్ నిరాకరించడమే ఇందుకు కారణం. దీంతో గంటల తరబడి విమానం కదలకపోవడంతో ప్రయాణికుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే, ఇండిగో ఫ్లైట్ 6ఈ 1085 గురువారం ఉదయం 4:05 గంటలకు ముంబై నుంచి బయలుదేరాల్సి ఉంది. అయితే, మరో విమానం ఆలస్యంగా రావడం, ఎయిర్ ట్రాఫిక్ రద్దీ వంటి కారణాలతో ఇది ఇప్పటికే మూడు గంటలకు పైగా ఆలస్యమైంది. ప్రయాణికులను విమానంలోకి ఎక్కించిన తర్వాత కూడా టేకాఫ్ కాకపోవడంతో వారి సహనం నశించింది. డ్యూటీ సమయం ముగిసిందని పైలట్ చెప్పడంతో వారు సిబ్బందితో తీవ్ర వాగ్వాదానికి దిగారు.

## లాభాలతో ముగిసిన సూచీలు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం స్వల్ప లాభాలతో ముగిశాయి. వారాంతంలో సానుకూల సంకేతాలతో సూచీలు లాభపడినప్పటికీ, ఇంట్రాడేలో తీవ్ర ఒడిదొడుకులను ఎదుర్కొన్నాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 187 పాయింట్లు లాభపడి 83,570 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 28 పాయింట్లు పెరిగి 25,694 వద్ద ముగిసింది. ఉదయం నిఫ్టీ 25,696 వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమైంది. డిసెంబర్ త్రైమాసికంలో ఐటీ కంపెనీల ఫలితాలు అంచనాలను మించి రావడం, టెక్నాలజీపై వ్యయాలు పెరుగుతాయన్న అంచనాలతో ఐటీ షేర్లలో బలమైన ర్యాలీ కనిపించింది. దీంతో నిఫ్టీ ఇంట్రాడేలో 25,873 గరిష్ఠ స్థాయికి చేరింది. అయితే, అధిక స్థాయిల వద్ద మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో సూచీలు 25,662 కనిష్ఠ స్థాయికి పడిపోయి, చివరికి స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 3.34 శాతం మేర దూసుకెళ్లి టాప్ గెయినర్‌గా నిలిచింది. మెరుగైన ఆస్తుల నాణ్యత, మార్జిన్ల అంచనాలతో బ్యాంకింగ్ షేర్లలోనూ కొనుగోళ్ల మద్దతు లభించింది. నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ 0.84 శాతం పెరిగి 60,082కి చేరి, కొత్త రికార్డు స్థాయికి చేరువైంది. మరోవైపు, ఫార్మా, కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగాలు వరుసగా 1.30 శాతం, 1.15 శాతం మేర నష్టపోయాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా స్వల్పంగా నష్టపోయాయి. కంపెనీల త్రైమాసిక ఫలితాలు ఆశాజనకంగా ఉంటే స్టాక్ ఆధారిత కదలికలు ఉండొచ్చని, అయితే సమీప భవిష్యత్తులో విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల అమ్మకాలు కొనసాగవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## మస్క్‌కు మరోసారి అష్లీ క్లెయిర్ మస్కా!


న్యూయార్క్: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన గ్రోక్ ఏఐ చాట్‌బాట్‌పై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఏఐ ద్వారా అనుమతి లేకుండా అశ్లీల, అసభ్యకరమైన డీప్‌ఫేక్ చిత్రాలు రూపొందుతున్నాయని, ముఖ్యంగా మహిళలు, పిల్లల ఫొటోలను లక్ష్యంగా చేసుకుంటున్నారన్న ఆరోపణలు ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. ఈ క్రమంలో ఎలాన్ మస్క్‌కు మరో న్యాయసంబంధ సమస్య ఎదురైంది. ప్రముఖ రచయిత్రి ఆష్లీ సెయింట్ క్లెయిర్ మస్క్‌కు చెందిన సంస్థపై న్యూయార్క్ స్టేట్ సుప్రీం కోర్టులో దావా వేసినట్లు అంతర్జాతీయ మీడియా సంస్థలు వెల్లడించాయి. తన అనుమతి లేకుండానే గ్రోక్ ఏఐ తనను అశ్లీలంగా చూపించే డీప్‌ఫేక్ చిత్రాలను రూపొందిస్తోందని ఆష్లీ తన పిటిషన్‌లో ఆరోపించారు. వినియోగదారులు ఇచ్చే ప్రాంప్ట్‌ల ఆధారంగా గ్రోక్ తన ప్రతిష్ఠకు భంగం కలిగించే రీతిలో చిత్రాలను సృష్టిస్తోందని పేర్కొన్నారు. గతంలో ఈ విషయాన్ని సంస్థ దృష్టికి తీసుకెళ్లానని... వాటిని నిలిపివేస్తామని అప్పుడు తనకు చెప్పి మళ్లీ అలాంటి కంటెంట్ రూపొందిస్తున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే ఈ చర్యలను ఆపాలని, తనకు తగిన నష్టపరిహారం చెల్లించాలని ఆమె కోర్టును కోరినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ఇప్పటివరకు ఎక్స్ నుంచి అధికారిక స్పందన వెలువడలేదు.



## భారత్‌కు మరిన్ని రఫేల్ విమానాలు

న్యూయార్క్: భారత రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ఫ్రాన్స్‌కు చెందిన డసో ఏవియేషన్ నుంచి మరో 114 రఫేల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేసే ప్రతిపాదనకు ఆయుధ సేకరణ బోర్డు (డీపీబీ) శుక్రవారం ఆమోదం తెలిపింది. భారత వాయుసేన (ఐఏఎఫ్) గత ఏడాది ఈ మేరకు రక్షణ మంత్రిత్వ శాఖకు అధికారికంగా ప్రతిపాదన పంపిన విషయం తెలిసిందే. రక్షణ వర్గాల సమాచారం ప్రకారం, ఈ ప్రతిపాదన తదుపరి ఆమోదం కోసం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని రక్షణ కొనుగోలు మండలి (డీఏసీ) ముందుకు వెళ్లనుంది. అనంతరం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగే భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ దీనికి తుది ఆమోదముద్ర వేయనుంది. అంతా సవ్యంగా జరిగితే వచ్చే నెలలోనే భారత్, ఫ్రాన్స్ మధ్య ఈ ఒప్పందంపై సంతకాలు జరిగే అవకాశం ఉంది.

## వయ్యారి చిత్రం



## మార్చి 5న స్పిరిట్ రిలీజ్




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'స్పిరిట్ణ చిత్రానికి సంబంధించి ఓ సర్‌ప్రైజింగ్ ట్రీట్ ఇచ్చారు. 'స్పిరిట్ణ చిత్రాన్ని 2027 మార్చి 5న వరల్డ్‌వైడ్ గ్రాండ్ రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. దీంతో ఒక్కసారిగా ప్రభాస్ అభిమానుల్లో స్పిరిట్ జోష్ నింపేసింది. ఈ సినిమాను సందీప్ రెడ్డి తనదైన మార్క్ టేకింగ్‌తో రూపొందిస్తున్నారు. ఇక ఈ సినిమాలో ప్రభాస్ ఓ రూత్‌లెస్ కాప్ పాత్రలో నటించబోతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో త్రిప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తుండగా వివేక్ ఒబెరాయ్, ప్రకాష్ రాజ్, కాంచన తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## నెట్‌ఫ్లిక్స్‌లో పెద్ది!

మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్ గా దర్శకుడు బుచ్చిబాబు సానా కలయికలో చేస్తున్న భారీ చిత్రమే 'పెద్ది'. పాన్ ఇండియా లెవెల్లో మంచి అంచనాలు సెట్ చేసుకున్న ఈ సినిమా షూటింగ్ దాదాపు చివరి దశకు చేరుకుంటుంది. మరి ఈ సినిమాపై ఇప్పుడు బిగ్ అప్డేట్ బయటకి వచ్చింది. ఈ సినిమా తాలూకా పాన్ ఇండియా భాషల్లో హక్కులు దిగ్గజ సంస్థ నెట్ ఫ్లిక్స్ సొంతం చేసుకున్నట్టు కన్ఫర్మ్ చేశారు. సో థియేటర్స్ రిలీజ్ తర్వాత ఈ సినిమా పాన్ ఇండియా భాషల్లో అందుబాటులో ఉడనుంది. మరి ఈ సినిమాని ఎంతకి సొంతం చేసుకున్నారు అనే ఇతర డీటెయిల్స్ బయటకి రావాల్సి ఉన్నాయి. ఇక ఈ భారీ సినిమాకి ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు అలాగే వృద్ధి సినిమాస్ నిర్మాణం వహిస్తున్నారు. అలాగే ఈ మార్చ్ 27న గ్రాండ్ గా రిలీజ్ కి రానుంది.




## అనసూయకు వేధింపులు..


# 42 మందిపై కేసు

ప్రముఖ సినీ, టీవీ నటి అనసూయ భరద్వాజ్ తనకు ఎదురైన తీవ్రమైన ఆన్‌లైన్ వేధింపులు, పరువునష్టం, లైంగిక వేధింపులు, క్రిమినల్ బెదిరింపులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనపై అసభ్యకరమైన, మార్ఫింగ్ చేసిన డిజిటల్ కంటెంట్‌ను సర్క్యులేట్ చేస్తున్నారని ఆరోపిస్తూ ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైబరాబాద్ పోలీసులు పలువురు వ్యక్తులు, మీడియా ప్రతినిధులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, అనసూయ ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు ఆధారంగా సైబరాబాద్‌లోని సైబర్ క్రైమ్స్ పోలీస్ స్టేషన్‌లో జనవరి 12, 2026న ఎఫ్‌ఐఆర్ (నెం. 81/2026) నమోదు చేశారు. ఈ కేసులో భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్లు 75, 79, 336(4), 351, 356లతో పాటు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) చట్టం-2000లోని సెక్షన్లు 66-ఈ, 67 కింద అభియోగాలు మోపారు. ఈ ఎఫ్‌ఐఆర్‌లో మొత్తం 42 మందిని నిందితులుగా చేర్చారు. వీరిలో ప్రముఖ వ్యాఖ్యాతలు బొజ్జ సంధ్యారెడ్డి, ప్రియా చౌదరి గొగినేని, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ పావని, ఆర్టిస్ట్ శేఖర్ బాషా (రాజా శేఖర్ గుడిమెట్ల), అడ్వకేట్ రజని, నటి కరాటే కల్యాణి, బిగ్ టీవీ యాంకర్ రోహిత్, ఆర్‌టీవీ న్యూస్ నెట్‌వర్క్ యాంకర్ మనోజ్ ఎజ్జిగిరి వంటి వారు ఉన్నారు. వీరితో పాటు పలువురు గుర్తు తెలియని వ్యక్తుల పేర్లను కూడా చేర్చారు. నిందితుల్లో చాలా మంది పేర్లు తెలియవని, దర్యాప్తులో వారిని గుర్తిస్తామని పోలీసులు తెలిపారు.



## సమంత.. ది బిజినెస్ వుమన్

సమంత ప్రస్తుతం కేవలం నటిగానే కాకుండా ఒక సీరియస్ బిజినెస్ ఉమెన్‌గా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంటున్నారు. అందాల నటి రాజ్ నిడిమోరును పెళ్లాడిన తర్వాత మరింత ఎనర్జిటిక్ గా వ్యవస్థాపక రంగంలో దూసుకుపోతోంది. సామ్ కొన్ని పాపులర్ బ్రాండ్లకు మద్ధతుదారుగా ఉన్నారు. ఇటీవల మైల్ కలెక్టివ్ అనే కొత్త యాక్టివ్ బ్రాండ్ ని సామ్ ప్రారంభించారు. కాగా, సమంత ఒక ఇంటర్వ్యూలో తాను దాదాపు 15 పెద్ద బ్రాండ్ ఎండార్స్‌మెంట్లను తిరస్కరించినట్లు వెల్లడించారు. దీనివల్ల ఆమె కోట్లాది రూపాయల ఆదాయాన్ని వదులుకున్నారు. గతంలో సక్సెస్ అంటే ఎన్ని బ్రాండ్లకు అంబాసిడర్‌గా ఉన్నామనేది కొలమానం అనుకునేదాన్ని. కానీ ఇప్పుడు నా ఆలోచన మారింది. ఏదైనా బ్రాండ్‌ను ప్రమోట్ చేసే ముందు నేను ముగ్గురు డాక్టర్ల సలహా తీసుకుంటాను. ప్రజల ఆరోగ్యంపై చెడు ప్రభావం చూపే ఉత్పత్తులను నేను ఇకపై ప్రమోట్ చేయను... అని తెలిపారు. తన 20 ఏళ్ళ వయసులో చేసిన కొన్ని ప్రకటనల విషయంలో తన ప్రస్తుత వెర్షన్ నాటి పాత వెర్షన్‌కు క్షమాపణలు చెప్పాలని భావిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.



## పూరీసేతుపతి.. స్లమ్ డాగ్

ప్రముఖ కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ సేతుపతి, టాలీవుడ్ లో డేరింగ్ అండ్ డాషింగ్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ కాంబినేషన్లో పూరీ సేతుపతి అనే వర్కింగ్ టైటిల్ తో ఒక సినిమా రూపు దిద్దుకుంటున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ కూడా పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. తాజాగా విజయ్ సేతుపతి పుట్టినరోజు కావడంతో ఈ సినిమాకు సంబంధించిన టైటిల్ తో పాటు హీరో ఫస్ట్ లుక్ పోస్టర్ని కూడా విడుదల చేశారు. ఈ చిత్రానికి పూరీ జగన్నాథ్ తన శైలికి తగ్గట్టుగా 'స్లమ్ డాగ్ణ అనే ఒక శక్తివంతమైన టైటిల్ని పెట్టారు. అలాగే "33 టెంపుల్ స్ట్రీటు అనే ట్యాగ్ లైన్ ని కూడా పెట్టడం గమనార్హం. ముఖ్యంగా పూరీ జగన్నాథ్ తన సినిమాలకు తీసుకొచ్చే డైనమిక్ స్పర్శను తెలియజేస్తోంది. ఇక విజయ్ సేతుపతి లుక్ విషయానికి వస్తే.. బిచ్చగాడి దుస్తులు ధరించి, కళ్ళజోడు పట్టుకొని , రక్తం అంటుకున్న కత్తిని తన చేత్తో పట్టుకున్నాడు. పైగా అతని చుట్టూ భారీగా డబ్బు కూడా కనిపిస్తోంది. ఇకపోతే ఒక బిచ్చగాడు అనుకోకుండా కోటీశ్వరుడుగా మారే కథతో ఈ సినిమా ఉడవచ్చని పోస్టర్ చూస్తే తెలుస్తోంది.




## అమీర్ ఖాన్‌పై పెరుగుతున్న నెగిటివిటీ

బాలీవుడ్ స్టార్ హీరో అమీర్ ఖాన్ మరోసారి వివాదంలో చిక్కుకున్నారనే చెప్పాలి. గత కొన్ని రోజులుగా అటు వృత్తిపరమైన.. ఇటు వ్యక్తిగతంగా విమర్శలు ఎదుర్కొంటూ నెగిటివిటీ మూటగట్టుకుంటున్న ఈయన తాజాగా భాష గురించి చేసిన కామెంట్లతో మళ్ళీ వివాదాల్లో చిక్కుకున్నారని చెప్పవచ్చు. దీంతో మళ్లీ అమీర్ ఖాన్ పై నెగెటివిటీ పెరిగిపోతుందని అభిమానులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికలలో ఓటు వేసిన అమీర్ ఖాన్ అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. అందరూ ఓటు వేయాలని మరాఠీలో చెబుతుండగా, ఒక రిపోర్టర్ హిందీలో చెప్పాలని కోరారు. దీనికి ఆయన మాట్లాడుతూ.. హిందీలో మాట్లాడాలా.. ఇది మహారాష్ట్ర భాయ్ అని అన్నారు.. వెంటనే రిపోర్టర్ ఈ లైవ్ ఢిల్లీలో కూడా ప్రసారమవుతుంది సార్ అని చెప్పడంతో.. ఇది ఢిల్లీ వరకు వెళుతుందా.. చాలా ఏర్పాట్లు చేశారే.. అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను.. అంటూ కామెంట్ చేశారు.



## సీనియర్ నటి శారదకు ప్రతిష్ఠాత్మక అవార్డు

తెలుగు గడ్డపై పుట్టి, దక్షిణ భారత చిత్రసీమలో తన నటనతో చెరగని ముద్ర వేసిన ప్రముఖ నటి శారద అరుదైన గౌరవం అందుకున్నారు. మలయాళ చిత్ర పరిశ్రమకు ఆమె చేసిన జీవితకాల సేవలకుగాను కేరళ ప్రభుత్వ అత్యున్నత సినీ పురస్కారమైన 'జేసీ డేనియల్ అవార్డు-2024'కు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని కేరళ సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రి సాజి చెరియన్ శుక్రవారం తిరువనంతపురంలో అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు కింద రూ. 5 లక్షల నగదు బహుమతి, ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేస్తారు. జనవరి 25న తిరువనంతపురంలో జరిగే కేరళ రాష్ట్ర చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవంలో ముఖ్యమంత్రి పినరయి విజయన్ చేతుల మీదుగా శారద ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. ప్రముఖ గీత రచయిత, 2017 జేసీ డేనియల్ అవార్డు గ్రహీత శ్రీకుమరన్ తంబి అధ్యక్షతన ఏర్పాటైన జ్యూరీ శారదను ఈ పురస్కారానికి ఏకగ్రీవంగా ఎంపిక చేసింది. ఈ కమిటీలో నటి ఊర్వశి, సినీ నిర్మాత బాలు కిరియత్ సభ్యులుగా, కేరళ రాష్ట్ర చలనచిత్ర అకాడమీ కార్యదర్శి సి. అజోయ్ కన్వీనర్‌గా వ్యవహరించారు.






# ఆడతారా? లేదా?

### బంగ్లాదేశ్‌కు ఐసీసీ బృందం

### వరల్డ్‌కప్ మ్యాచ్‌ల అనిశ్చితికి తెరపడేనా..?




టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లను భారత్ నుంచి తలరించాలనే విషయమై బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు బెట్టు వీడడం లేదు. ఇదివరకే షెడ్యూల్ ప్రకటించినందున నిర్ణయాన్ని సమీక్షించుకోవాలని అంతర్జాతీయ క్రికెట్ మండలి కోరినా బంగ్లా బోర్డు ససేమిరా అంటోంది. ఈ నేపథ్యంలో కొన్ని రోజులుగా నెలకొన్న అనిశ్చితికి తెరదించేందుకు ఐసీసీ స్వయంగా రంగంలోకి దిగనుంది. చివరి ప్రయత్నంగా ఇద్దరు సీనియర్ ప్రతినిధులను బంగ్లా దేశ్ బోర్డు సభ్యులతో చర్చించేందుకు పంపించనుంది. భారత్, శ్రీలంక వేదికగా ఫిబ్రవరి 7 నుంచి టీ20 ప్రపంచకప్ షురూ కానుంది. ఇప్పటికే షెడ్యూల్ ప్రకటించిన ఐసీసీ.. వేదికలను కూడా ఖరారు చేసింది. కానీ, బంగ్లాదేశ్ బోర్డు మాత్రం తమ జట్టును భారత్‌కు పంపించబోమని భీష్మించుకుంది. దాంతో, ఆ దేశ బోర్డుతో చర్చలు మొదలెట్టింది ఐసీసీ. భద్రతా కారణాలరీత్యా ఇండియాలో ఆడబోమనే నిర్ణయంపై పునరాలోచన చేయాలని వీడియో కాల్‌లో కోరినప్పటికీ బంగ్లా బోర్డు 'అదేం కుదరదు' అంటోంది. అందుకని ఇద్దరు సీనియర్ ప్రతినిధులను ఆ దేశానికి పంపి.. వారికి భరోసా కల్పించాలని ఐసీసీ భావిస్తోంది. ప్రపంచ క్రికెట్‌లో బంగ్లాదేశ్‌ను తాము వేరుగా చూడబోమనే నమ్మకాన్ని వారికి కలిగించి.. భారత్‌లో వరల్డ్‌కప్ ఆడేందుకు ఒప్పించనుంది.



## ప్రేమ కోసం పాక్‌కు స్పిన్నర్ గుడ్‌బై

క్రికెట్ ప్రపంచంలో అత్యంత ప్రమాదకరమైన లెగ్ స్పిన్నర్లలో ఇమ్రాన్ తాహిర్ ఒకరు. వికెట్ తీసిన తర్వాత స్టేడియమంతా పరిగెడుతూ ఆయన చేసే సందడి అభిమానులకు కన్నుల పండువగా ఉంటుంది. అయితే ఇమ్రాన్ తాహిర్ దక్షిణాఫ్రికా తరఫున ఆడినప్పటికీ.. ఆయన పుట్టి పెరిగింది మాత్రం పాకిస్థాన్‌లో. తన మనసు గెలుచుకున్న భారత సంతతి యువతి కోసం ఆయన పాకిస్థాన్ దేశాన్ని వదిలి వెళ్లడం విశేషం. దక్షిణాఫ్రికా మాజీ స్టార్ స్పిన్నర్ ఇమ్రాన్ తాహిర్ క్రికెట్ ప్రయాణం ఎంత అద్భుతమో, ఆయన ప్రేమకథ అంతకంటే సినిమాటిక్‌గా ఉంటుంది. కేవలం తన ప్రేమ కోసం ఒక దేశాన్ని వదిలి మరో దేశానికి వెళ్లి, అక్కడ ప్రపంచస్థాయి క్రికెటర్‌గా ఎదిగాడు. 1979లో లాహోర్‌లో జన్మించిన ఇమ్రాన్ తాహిర్ కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేకపోవడంతో 16 ఏళ్ల వయసులోనే ఒక షాపింగ్ మాల్‌లో సేల్స్‌మెన్‌గా పనిచేశారు. అయినప్పటికీ క్రికెట్‌పై మక్కువతో కష్టపడి ప్రాక్టీస్ చేసి పాకిస్థాన్ అండర్-19 జట్టుకు ఎంపికయ్యారు. ఆ సమయంలోనే ఆయన జీవితం ఊహించని మలుపు తిరిగింది. పాకిస్థాన్ అండర్-19 జట్టు దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లినప్పుడు ఇమ్రాన్ తాహిర్‌కు సుమయ్యా దిల్‌దార్ పరిచయమయ్యారు. సుమయ్యా భారత సంతతికి చెందిన దక్షిణాఫ్రికా యువతి. ఆమెను చూడగానే తాహిర్ ప్రేమలో పడిపోయారు.

## కోహ్లీనే అత్యుత్తమ బ్యాటర్: కైఫ్

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపై మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ ప్రశంసల జల్లు కురిపించాడు. మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ కంటే కోహ్లీనే అత్యుత్తమ బ్యాటర్ అని తెలిపాడు. ముఖ్యంగా వన్డే ఫార్మాట్‌లో కోహ్లీకి తిరుగులేదని చెప్పాడు. అతని గణాంకాలను చూస్తేనే ఈ విషయం స్పష్టమవుతుందన్నాడు. అంతర్జాతీయ టీ20లతో పాటు టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన రోహిత్, కోహ్లీ..




కేవలం వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతున్న సంగతి తెలిసిందే. వన్డే ప్రపంచకప్ 2027 ఆడటమే లక్ష్యంగా ఈ ఇద్దరూ ఈ ఫార్మాట్‌లో కొనసాగుతున్నారు. వన్డే ప్రపంచకప్ అందించి సగర్వంగా ఆటకు వీడ్కోలు పలకాలని భావిస్తున్నారు. రోహిత్ శర్మ దూకుడుకు పెట్టింది పేరైతే.. విరాట్ కోహ్లీ నిలకడకు నిలువెత్తు నిదర్శనం. అయితే వన్డే ఫార్మాట్‌లో రోహిత్ కంటే విరాట్ కోహ్లీ ఎప్పటికీ ఓ అడుగు ముందుంటాడని కైఫ్ తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా పేర్కొన్నాడు. 'విరాట్ కోహ్లీ తనకు లభించిన ఆరంభాలను పెద్ద స్కోర్లుగా మారుస్తాడు.




## బుడ్డోడి మరో చరిత్ర

అండర్ 19 వన్డే ప్రపంచకప్ 2026లో టీమిండియా శుభారంభం చేసింది. అమెరికాతో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. అయితే ఈ మ్యాచ్ ద్వారా టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ చరిత్ర సృష్టించాడు. భారత్ తరఫున అండర్ 19 ప్రపంచకప్ ఆడిన అత్యంత పిన్న వయస్కుడిగా నిలిచాడు. 14 ఏళ్ల 294 రోజుల వయసులో వైభవ్ సూర్యవంశీ అండర్ 19 ప్రపంచకప్ బరిలోకి దిగాడు. ఈ క్రమంలో కుమార్ కుశాగ్ర రికార్డ్‌ను అధిగమించాడు. అతను 15 ఏళ్ల 88 రోజుల వయసులో అండర్ 19 ప్రపంచకప్ ఆడాడు. 2020లో జరిగిన టోర్నీలో అమెరికాతో జరిగిన మ్యాచ్‌లో ఈ ఫీట్ సాధించాడు. తాజాగా ఈ రికార్డ్‌ను వైభవ్ సూర్యవంశీ బ్రేక్ చేశాడు. అండర్ 19 ప్రపంచకప్‌లో వైభవ్ సూర్యవంశీ శుభారంభం అందుకోలేకపోయాడు. అమెరికాతో తొలి మ్యాచ్‌లో 4 బంతుల్లో 2 పరుగులు మాత్రమే చేసి క్లీన్ బౌల్డ్ అయ్యాడు. సూర్య విఫలమైనా ఈ మ్యాచ్‌లో భారత్ గెలుపొందింది. శనివారం జరిగే తమ తదుపరి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో భారత జట్టు తలపడనుంది.




## వార్నర్ విశ్వరూపం

ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డేవిడ్ వార్నర్ వయసు పైబడుతున్నా కొద్దీ కుర్రాడిలా రెచ్చిపోతున్నాడు. 39 ఏళ్లలోనూ తనలో చేవ తగ్గలేదని నిరూపిస్తూ తన బ్రాండ్ క్రికెట్‌తో అభిమానులను అలరిస్తున్నాడు. రెండేళ్ల క్రితం అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన వార్నర్.. ఫ్రాంచైజీ క్రికెట్‌లో సెంచరీలతో విరుచుకుపతున్నాడు. బిగ్‌బాష్ లీగ్‌లో విధ్వంసక శతకంతో రికార్డు నెలకొల్పాడు. పొట్టి ఫార్మాట్‌లో పదోసారి మూడంకెల స్కోర్ అందుకోవడంతో పాటు14 వేల పరుగుల మైలురాయిని అధిగమించాడీ చిచ్చరపిడుగు. ఫార్మాట్ ఏదైనా దూకుడే మంత్రంగా చెలరేగే డేవిడ్ వార్నర్ స్వదేశంలో జరుగుతున్న బిగ్‌బాష్ లీగ్‌లో సెంచరీలతో మెరుస్తున్నాడు. జనవరి 3వ తేదీన హోబర్ట్ హరికేన్స్ బౌలర్లను ఉతికేస్తూ 57 బంతుల్లోనే వంద కొట్టి.. 130 పరుగులతో అజేయంగా నిలిచాడీ మాజీ ప్లేయర్. అంతర్జాతీయ, ఫ్రాంచైజీ టీ20ల్లో అతడికి 9వ సెంచరీ అది. తాజాగా సిడ్నీ సిక్సర్స్ బౌలర్ల భరతం పట్టిన అతడు.. 101 రన్స్‌తో జట్టును గెలిపించాడు.

## వన్డేలకూ జడేజా గుడ్ బై?



భారత క్రికెట్‌లో అత్యంత నమ్మదగ్గ ఆల్‌రౌండర్‌గా పేరు తెచ్చుకున్న రవీంద్ర జడేజా గ్రాఫ్ వేగంగా పడిపోతోంది. గత కొంతకాలంగా ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడుతున్న జడ్డూ.. త్వరలోనే అంతర్జాతీయ వన్డేలకు వీడ్కోలు పలికే అవకాశం ఉందనే వార్తలు క్రీడా వర్గాల్లో వేడెక్కించాయి. 2024 టీ20 ప్రపంచ కప్ తర్వాత ఆ ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన జడేజా.. ఇప్పుడు వన్డేల్లోనూ తన ప్రభావాన్ని కోల్పోతున్నాడు. ముఖ్యంగా గత రెండేళ్లుగా గణాంకాలు చూస్తుంటే ఆయన కెరీర్ ముగింపు దశకు చేరుకుందనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 2023 వరల్డ్ కప్ ఏడాదిలో 26 మ్యాచ్‌లాడి 31 వికెట్లు తీసిన రవీంద్ర జడేజా.. ఆ తర్వాత పూర్తిగా వెనుకబడ్డాడు. 2025, 2026 సీజన్లలో కలిపి జడేజా కేవలం 13 వన్డేలు మాత్రమే ఆడాడు. వీటిలో జడ్డూ చేసింది కేవలం 139 పరుగులు మాత్రమే, తీసిన వికెట్లు 12 మాత్రమే. 208 వన్డేల అనుభవం ఉన్న ఆటగాడికి ఇవి చాలా పేలవమైన గణాంకాలు. బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ జడేజా మునపటి పదును చూపలేకపోతున్నాడు. జడేజా స్థానానికి అక్షర్ పటేల్ నుంచి గట్టి పోటీ ఎదురవుతోంది. 2025లో అక్షర్ 11 వన్డేల్లోనే 290 పరుగులు చేయడమే కాకుండా 11 వికెట్లు తీసి తన సత్తా చాటాడు. ప్రస్తుతం టీ20 వరల్డ్ కప్ జట్టులో ఉన్న కారణంగా అక్షర్ అందుబాటులో లేకపోయినా, జూన్‌లో ఇంగ్లాండ్‌తో జరిగే సిరీస్ నాటికి అతను జట్టులోకి రావడం ఖాయం. అప్పుడు జడేజా తన స్థానాన్ని కాపాడుకోవడం దాదాపు అసాధ్యంగా మారుతుంది.

## ఇప్పుడైనా అర్ష్‌దీప్‌రకు చాన్స్ ఇవ్వాలి: అశ్విన్

న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌లకు దూరంగా ఉంచిన టీమిండియా స్టార్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌ను ఆఖరి మ్యాచ్‌లోనైనా ఆడించాలని మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ అన్నాడు. హర్షిత్ రాణా, ప్రసిధ్ కృష్ణకు మ్యాచ్ ప్రాక్టీస్ అవసరమని అభిప్రాయం వ్యక్తం చేశాడు. ఈ సిరీస్‌లో ఇరు జట్లు చెరో మ్యాచ్ గెలిచాయి. మూడో వన్డే ఆదివారం ఇండోర్ వేదికగా జరగనుంది. ఈ మ్యాచ్‌లో అర్ష్‌దీప్ సింగ్‌ను ఆడించాలని అశ్విన్ సూచించాడు. 'బౌలర్ల మధ్య తీవ్ర పోటీ ఉంది. ప్రసిధ్ కృష్ణ, హర్షిత్ రాణాకు మ్యాచ్ ప్రాక్టీస్ అవసరం. సౌతాఫ్రికాతో మ్యాచుల్లో అయితే హిట్ ది డెక్ బౌలర్ అవసరం. అయితే న్యూజిలాండ్‌తో ఆ ఫార్ములా వర్కౌట్ కాదు. అందుకే అర్ష్‌దీప్ సింగ్‌ను తుది జట్టులో ఆడించాలి. అతను ఇప్పటికే ఎంతో చేశాడు. కానీ ఇప్పటికీ అతను జట్టులో స్థానం కోసం పోరాడుతున్నాడు. ఇలా ప్రతిసారీ బౌలర్ల విషయంలోనూ జరుగుతోంది. బ్యాటర్ల విషయంలో మాత్రం కాదు. నేను అర్ష్‌దీప్ సింగ్‌కు ఎందుకు మద్దతుగా నిలుస్తున్నానంటే.. అతని చేతికి బంతి ఇచ్చిన ప్రతీసారి అద్భుత ప్రదర్శన చేస్తున్నాడు. అందుకే అతనికి తుది జట్టులో చోటు కల్పించాలని కోరుతున్నా. అతనికి ఆ అర్హత ఉంది. తొలి రెండు వన్డేల్లో అర్ష్‌దీప్ సింగ్‌ను ఎందుకు తప్పించారు. అది అతని ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయదా?'అని అశ్విన్ ప్రశ్నించాడు.



ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం www.evarthalu.com
నేటి ఈవార్తలు
శనివారం 17-1-2026

# ప్రజాస్వామ్యానికి 'సెలవు'




పండుగలు, సెలవు దినాలు అంటే సామాన్యుడికి సేదదీరే సమయం. కానీ, నేటి పాలకులకు అవే అదను. కోర్టులు తలుపులు మూసినప్పుడు, న్యాయం వైపు నుంచి రక్షణ కవచం అందనప్పుడు.. జనం పండుగ హడావుడిలో మునిగి ఉన్నప్పుడు ప్రభుత్వ యంత్రాంగం 'విధ్వంసక' విన్యాసాలకు తెరలేపడం ఒక ప్రమాదకరమైన సంప్రదాయంగా మారుతోంది. తెలంగాణలో హైడ్రా చేస్తున్న కూల్చివేతలు, పోలీసుల అర్ధరాత్రి అరెస్టుల పర్వం చూస్తుంటే.. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగం కంటే 'నిరంకుశత్వం' పైచేయి సాధిస్తోందా? అన్న అనుమానం కలగక మానదు. ప్రభుత్వాలు చేసే ఏ చర్యకైనా 'నైతికత' అనేది ఆత్మ లాంటిది. చెరువుల ఆక్రమణలు తొలగించడం, అక్రమ కట్టడాలను కూల్చడం తప్పు కాదు. కానీ, ఆ చర్యల కోసం ఎంచుకుంటున్న సమయమే పాలకుల దురుద్దేశాన్ని చాటిచెబుతోంది. శని, ఆదివారాలు లేదా వరుస పండుగ సెలవులను ఎంచుకుని జేసీబీలను రంగంలోకి దింపడం వెనుక ఉన్న ఏకైక లక్ష్యం.. బాధితులకు న్యాయస్థానం తలుపు తట్టే అవకాశం ఇవ్వకపోవడమే. ఒక వైపు ప్రజలు పండుగ సంబురాల్లో ఉంటే.. మరోవైపు బుల్డోజర్లు పేదల ఇళ్లను నేలమట్టం చేస్తున్నాయి. స్టే ఆర్డర్ తెచ్చుకునే లోపే సర్వం తుడిచిపెట్టేయాలనే ఈ సర్జికల్ స్ట్రైక్ వ్యూహం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధం. ప్రభుత్వం వద్ద పక్కా ఆధారాలు ఉంటే, సాధారణ పనిదినాల్లో నోటీసులు ఇచ్చి ఎందుకు చర్యలు తీసుకోలేకపోతోంది? కోర్టుల పట్ల పాలకులకు ఉన్న గౌరవం ఇదేనా?

ఇక అరెస్టుల విషయానికొస్తే.. పరిస్థితి మరింత దిగజారింది. నిరసన గళాన్ని అణచివేయడానికి 'నివారణ అరెస్టుల' పేరుతో నాయకులను, సామాజిక కార్యకర్తలను, చివరకు జర్నలిస్టులను కూడా సెలవు రోజుల్లోనే అదుపులోకి తీసుకోవడం పరిపాటిగా మారింది. సెలవు రోజుల్లో అరెస్టు చేయడం వల్ల నిందితులకు వెంటనే న్యాయ సహాయం అందదు. రిమాండ్ ప్రక్రియ ఆలస్యమవుతుంది. కుటుంబ సభ్యులు పండుగ జరుపుకోవాల్సిన వేళ, ఇంటి పెద్దను ఏ అర్ధరాత్రో ఈడ్చుకెళ్లడం మానసిక హింస కిందకు రాదా? ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికీ ఉంటుంది. కానీ, ప్రశ్నిస్తే జైలు.. అడ్డుకుంటే ఇల్లు కూల్చివేత అనే వాతావరణాన్ని సృష్టించడం ద్వారా ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడమే లక్ష్యంగా కనిపిస్తోంది. వ్యవస్థలన్నీ తమ గుప్పిట్లో ఉన్నాయని, న్యాయస్థానాలు సెలవులో ఉన్నప్పుడు తామే సుప్రీం అని పాలకులు భావించడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు. చెరువులు రక్షించబడాలి, అక్రమార్కులు శిక్షించబడాలి.. ఇందులో ఎవరికీ భిన్నాభిప్రాయం లేదు. కానీ ఆ ప్రక్రియ చట్టబద్ధంగా, మానవత్వంతో కూడి ఉండాలి. సెలవులను అడ్డు పెట్టుకుని ప్రజల గొంతు నొక్కడం, గూడు చెడగొట్టడం అంటే రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు సెలవు ప్రకటించడమే. అధికారం శాశ్వతం కాదు. నేడు సెలవులను అదునుగా చూసుకుని విర్రవీగుతున్న పాలకులు, రేపు ప్రజల తీర్పును కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని గుర్తుంచుకోవాలి. న్యాయవ్యవస్థ కూడా ఇటువంటి 'సెలవు దినాల ఉల్లంఘనల'పై ప్రత్యేక దృష్టి సారించి, ప్రభుత్వాల మొండి వైఖరికి కళ్లెం వేయాల్సిన అవసరం ఉంది. లేదంటే సామాన్యుడికి 'సెలవు' అంటే విశ్రాంతి కాదు.. ప్రభుత్వ గండం అన్నట్లుగా మారుతుంది.

– ఈవార్తలు సంపాదకీయ విభాగం



# స్పీకర్ రాజ్యాంగ ఉల్లంఘన

భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభాపతిపదవి అత్యున్నతమైనది, పవిత్రమైనది. సభలో నిష్పాక్షికతకు, రాజ్యాంగ విలువలకు స్పీకర్ ఒక రక్షణ కవచంలా నిలవాలి. కానీ, తెలంగాణలో ప్రస్తుత రాజకీయ పరిణామాలు గమనిస్తుంటే, ఆ పదవికి ఉండాల్సిన నైతికత ప్రశ్నార్థకంగా మారుతోంది. ఒక పార్టీ గుర్తుపై గెలిచి, అధికార పార్టీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ అనుసరిస్తున్న తాత్సారం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోంది. ఇది కేవలం రాజకీయ వ్యూహం కాదు, రాజ్యాంగం కల్పించిన పదవినీ, ప్రజలు ఇచ్చిన తీర్పును అవమానించడమే. భారత రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ పార్టీ ఫిరాయింపులను నిరోధించడానికి రూపొందించబడింది. ప్రజాస్వామ్యంలో ఓటర్ల తీర్పుకు గౌరవం ఉండాలనేది దీని ప్రధాన ఉద్దేశ్యం.

ఒక పార్టీ తరపున ఓట్లు అడిగి గెలిచిన ప్రజా ప్రతినిధి, వ్యక్తిగత లాభం కోసమో లేదా అధికార వ్యామోహం కోసమో పార్టీ మారినప్పుడు, వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత స్పీకర్‌పై ఉంటుంది. అయితే, తెలంగాణలో గత కొన్ని నెలలుగా జరుగుతున్న పరిణామాలు దీనికి విరుద్ధంగా ఉన్నాయి. ప్రతిపక్ష పార్టీల నుంచి అధికార పార్టీలోకి చేరిన ఎమ్మెల్యేల విషయంలో అనర్హత పిటిషన్లు దాఖలైనప్పటికీ, స్పీకర్ కార్యాలయం నుంచి ఎటువంటి కదలిక లేకపోవడం గమనార్హం. ఇది చట్టం స్ఫూర్తిని చంపేయడమే కాకుండా, ఫిరాయింపుదారులకు ఒక అవకాశంగా మారుతోంది. ఇటీవల సుప్రీం కోర్టు కూడా ఈ విషయంలో ఘాటుగా స్పందించింది. అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడానికి ఒక కాలపరిమితిని నిర్దేశించాలని స్పీకర్ కార్యాలయాన్ని కోరడం, మన వ్యవస్థలో స్పీకర్ వ్యవస్థ ఎంతలా నిర్వీర్యం అవుతుందో చెప్పకనే చెబుతోంది. రాజ్యాంగం స్పీకర్‌కు ఇచ్చిన స్వయంప్రతిపత్తిని ఆయన రాజకీయ అవసరాలకు వాడుకోవడం వల్లనే న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవాల్సి వస్తోంది. ఇది స్పీకర్ పదవికి చెంపపెట్టు వంటిది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు అభివృద్ధి కోసమే మారుతున్నామని చెప్పడం ఒక పెద్ద అబద్ధం. ప్రజలు ఒక సిద్ధాంతానికి, ఒక గుర్తుకు ఓటు వేశారు. పార్టీ మారాలనుకున్నప్పుడు ఆ పదవికి రాజీనామా చేసి, మళ్ళీ ప్రజల ముందుకు వెళ్లి గెలవడమే నిజమైన ప్రజాస్వామ్యం. కానీ, స్పీకర్ అండతో పదవులను కాపాడుకుంటూ, అధికార పార్టీలో విలీనం కావడం ఓటర్లను మోసం చేయడమే. ఈ ప్రక్రియలో స్పీకర్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం అంటే, ఆయన కూడా ఈ రాజ్యాంగ విరుద్ధమైన చర్యలో భాగస్వామి అవుతున్నారని భావించాల్సి ఉంటుంది. గతంలో కూడా తెలంగాణలో ఇలాంటి ఫిరాయింపులు జరిగాయి. అప్పుడు కూడా స్పీకర్ల తీరు వివాదాస్పదమైంది. ఇప్పుడు మళ్ళీ అదే పునరావృతం కావడం రాష్ట్ర రాజకీయాలకు శ్రేయస్కరం కాదు. స్పీకర్ అనే వ్యక్తి ఒక పార్టీకి చెందిన వ్యక్తిగా కాకుండా, సభకు తండ్రిలా వ్యవహరించాలి. ఫిరాయింపు దారులపై నిర్ణయం తీసుకోకుండా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచడం వల్ల, సదరు ఎమ్మెల్యేలు తమ పదవీ కాలాన్ని పూర్తి చేసుకునే అవకాశం లభిస్తుంది. ఇది రాజ్యాంగంపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని సడలిస్తుంది. ఒక పార్టీకి మెజారిటీ ఇచ్చినప్పుడు, ప్రతిపక్షం కూడా బలంగా ఉండాలి. కానీ, స్పీకర్ సహకారంతో ప్రతిపక్షాన్ని ఖాళీ చేయడం అనేది నియంతృత్వానికి దారితీస్తుంది. తెలంగాణ స్పీకర్ తన నిర్ణయాల ద్వారా ప్రజాస్వామ్య విలువలను కాపాడతారని ఆశించడం ప్రజల హక్కు. ఫిరాయింపుల విషయంలో కాలయాపన చేయడం అంటే రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమే. ఇప్పటికైనా స్పీకర్ తన రాజ్యాంగ బద్ధమైన బాధ్యతను గుర్తించి, అనర్హత పిటిషన్లపై తక్షణమే విచారణ చేపట్టి నిర్ణయం తీసుకోవాలి. లేదంటే, చరిత్రలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన వ్యవస్థగా స్పీకర్ కార్యాలయం మిగిలిపోతుంది.

-డాక్టర్ డీ రాజు పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్, రాజకీయ విశ్లేషకుడు

# పత్రిక స్వేచ్ఛకు సంకెళ్లు




ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన మౌలిక హక్కు. అయితే ఆ హక్కు ప్రభుత్వాలకు ఇబ్బందిగా మారిన ప్రతీసారి.. పోలీసు బూట్ల శబ్దం, అరెస్టులు, సోదాలు, నోటీసులు ముందుకు వస్తున్నాయి. తాజాగా తెలంగాణలో ఎన్టీవీ జర్నలిస్టుల అరెస్టు, కార్యాలయాల్లో సోదాలు ఈ చేదు నిజాన్ని మరోసారి రుజువు చేశాయి. ఇది ఒక వార్తపై చట్టపరమైన చర్య మాత్రమేనా? లేక ప్రభుత్వాన్ని విమర్శించే గొంతులను భయపెట్టే వ్యవస్థాగత ప్రయత్నమా? అనే ప్రశ్నకు ఈ పరిణామాలే సమాధానం చెబుతున్నాయి.

ఎన్టీవీ ఇన్‌పుట్ ఎడిటర్ దొంతు రమేష్, రిపోర్టర్ పరిపూర్ణాచారి, సుధీర్‌ల అరెస్టులు సాధారణ న్యాయ ప్రక్రియలా కనిపించవు. మహిళా ఐఏఎస్ అధికారిణిపై తప్పుడు ప్రచారం చేశారనే ఆరోపణల పేరుతో, ముందుగా నోటీసులు, వివరణ కోరడం వంటి చట్టబద్ధమైన మార్గాలు వదిలేసి, అర్ధరాత్రి అరెస్టులకు దిగడం అనేది స్పష్టంగా అధికారం ప్రదర్శించే చర్యగానే భావించాల్సి వస్తుంది. విచారణ అనంతరం కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేయడం కూడా.. ఈ కేసు బలహీనతను సూచిస్తుంది. ఇది ఒక్క సంఘటన మాత్రమే కాదు. గతాన్ని తిరగేస్తే, ప్రభుత్వాలు మీడియాను ఎలా చూసాయో స్పష్టంగా తెలుస్తుంది. ఎమర్జెన్సీ కాలంలో పత్రికలపై సెన్సార్, సంపాదకుల అరెస్టులు, పత్రికల ముద్రణ నిలిపివేతలు దేశ చరిత్రలో నల్ల అధ్యాయాలుగా నిలిచాయి. ఆ తర్వాత కూడా వివిధ రాష్ట్రాల్లో ప్రభుత్వాలను విమర్శించిన విలేకరులపై దాడులు, తప్పుడు కేసులు, యూట్యూబ్ ఛానళ్లపై నిషేధాలు, సోషల్ మీడియా పోస్టులకే అరెస్టులు కొనసాగుతూనే ఉన్నాయి. ఒకప్పుడు పత్రికా కార్యాలయాలపై దాడులు, మరో సందర్భంలో రిపోర్టర్లపై భౌతిక దాడులు.. ఇవన్నీ ప్రభుత్వాలకు అసహనంగా మారిన ప్రశ్నల ఫలితాలే. తెలంగాణలో ప్రస్తుతం చోటుచేసుకున్న పరిణామాల్లో అత్యంత ఆందోళన కలిగించే అంశం.. సిట్ ఏర్పాటు చేసి మీడియా సంస్థ కార్యాలయాల్లో పలుమార్లు సోదాలు నిర్వహించడం. ఇది చట్ట అమలుకంటే, మీడియాకు "హద్దులు దాటితే ఇలాగే ఉంటుంది" అనే హెచ్చరికలా కనిపిస్తోంది. ప్రజలకు సమాచారం అందించాల్సిన జర్నలిస్టులు, తమ భద్రత కోసమే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడితే.. ప్రజాస్వామ్యం ఎలా బతుకుతుంది? ప్రభుత్వం చేసే వాదన ఒకటే.. "తప్పుడు ప్రచారాన్ని అడ్డుకున్నాం." కానీ తప్పుడు వార్తలుంటే వాటిని ఖండించేందుకు, కోర్టుల్లో న్యాయపరంగా ఎదుర్కొనే అవకాశం ప్రభుత్వానికి ఉంది. చట్టం అందుకు మార్గం చూపుతోంది. ఆ మార్గాన్ని వదిలేసి, పోలీసు శక్తిని ప్రయోగించడం అంటే.. విమర్శను నేరంగా మార్చడమే. ఇది ప్రమాదకరమైన ధోరణి. ఈ వ్యవహారంపై ప్రతిపక్షాలే కాదు, కాంగ్రెస్ పార్టీలోనూ భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడం గమనార్హం. అర్ధరాత్రి అరెస్టులు సరికాదని, నోటీసులు ఇచ్చి విచారణకు పిలిస్తే సరిపోయేదని సొంత పార్టీ నేతలే చెప్పడం.. ప్రభుత్వ చర్యలపై అనుమానాలను మరింత బలపరుస్తోంది. రాజకీయంగా లాభం కోసం తీసుకున్న నిర్ణయాలు, చివరకు ప్రభుత్వానికే నష్టం చేస్తాయన్నది చరిత్ర చెబుతున్న సత్యం. పత్రికలు ప్రభుత్వ శత్రువులు కావు. అవి ప్రజల అద్దాలు. ఆ అద్దంలో కనిపించే ప్రతిబింబం నచ్చకపోతే, అద్దం పగలగొట్టడం పరిష్కారం కాదు. ప్రజల ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ప్రశ్నించే గొంతులను అరెస్టులతో నొక్కిపెట్టడం.. ప్రజాస్వామ్యానికి శిక్ష విధించడమే. ఈ రోజు ఎన్టీవీ జర్నలిస్టులు లక్ష్యమైతే, రేపు మరెవరో. ఈ పరంపర కొనసాగితే, చివరకు నిజం చెప్పే ధైర్యం ఎవరికీ మిగలదు. అందుకే ఈ అరెస్టులను ఖండించడం జర్నలిస్టుల సమస్యగా కాకుండా, ప్రజల సమస్యగా చూడాలి. పత్రికా స్వేచ్ఛకు భరోసా ఇవ్వడం ప్రభుత్వాల బాధ్యత. భయంతో నడిచే పాలన తాత్కాలికంగా నిలబడవచ్చు గానీ, ప్రజల విశ్వాసాన్ని మాత్రం శాశ్వతంగా కోల్పోతుంది. ప్రజాస్వామ్యంలో పాలకుల బలం పోలీసు లాఠీల్లో కాదు.. ప్రజల నమ్మకంలో ఉంటుంది.



కాలగిరి శ్రీనివాస్ రెడ్డి
సీనియర్ జర్నలిస్ట్

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.